శనివారం
28-05-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 334
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యా ఒంటరి కాదు : పుతిన్

రష్యాను ఒంటరి చేయడం అసాధ్యమని పుతిన్ పశ్చిమ దేశాలను హెచ్చరించారు. రష్యాను ఏకాకిని చేసేందుకు ప్రయత్నిస్తున్న దేశాలు ప్రధానంగా తమ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే హాని కలిగిస్తున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. 2 లో

రాక్షస పాలనకు చరమగీతం

- ఎన్నికలకు సిద్ధం కండి
- దృష్టి మరల్చేందుకే కోనసీమ అల్లర్లు
- సామాజిక న్యాయమంటూ సహచర దొంగలకు రాజ్యసభ సీట్లు
- తప్పులు ప్రశ్నిస్తే కేసులా: మహానాడులో టీడీపీ అధినేత చంద్రబాబు

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. వైసీపీ ఎమ్మెల్సీనే హత్య చేస్తాడు... దానిని పక్కదారి పట్టించేందుకు ప్రశాంతంగా ఉన్న కోనసీమలో అల్లర్లు సృష్టించి కులాల మధ్య చిచ్చు రేపుతారు. సామాజిక న్యాయం అంటూ సహచర దొంగలకు రాజ్యసభ సీట్లు కేటాయిస్తారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కేసులు పెట్టి బెదిరిస్తారు... దాడులు చేస్తారు... మరోపక్క పేదలపై బాదుడే బాదుడుతో పన్నులు విధిస్తారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ప్రత్యేక హోదా, పోలవరాన్ని గాలికొదిలేశారు... రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశంపై ఉంది. రాష్ట్రం దశ, దిశ మార్చే విధంగా కార్యకర్తలు మహానాడు నిర్ణయాలతో ఎన్నికలకు సిద్ధం కావాలి... క్విట్ జగన్... సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందుకెళ్లాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు ఒంగోలులో జరుగుతున్న మహాసభలను చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రారంభించారు.

విశాలాంధ్ర బ్యూరో - ఒంగోలు :
తెలుగు ప్రజల గుండెల్లో నుంచి ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 40 ఏళ్లు పూర్తి చేసుకొని ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఒంగోలులో ఏర్పాటు చేసిన మహానాడుకు తెలుగుతమ్ముళ్లు కదం తొక్కారు. వేలాది మంది ఎండను సైతం లెక్కచేయకుండా మహానాడుకు తరలివచ్చారు. మహానాడు శుక్రవారం ఉదయం ప్రతినిధుల సభతో మొదలైంది. ముందుగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఫోటో ప్రదర్శనను, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వేదికపైకి వచ్చి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మరణించిన పార్టీ కార్యకర్తలకు నివాళిగా మౌనం పాటించి సంతాపం తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా - మిగతా 2 లో

ఇదెక్కడి సామాజికన్యాయం

- ఒక్కొక్కరికీ రెండు పదవులు
- ఒకే కుటుంబంలో ఇద్దరికి మూడు పదవులు
- వదిన కార్పొరేటర్, మరిది ఎమ్మెల్సీ!
- తొలి నుంచి వైసీపీలో ఉన్నవారికి గుర్తింపు ఏదీ!
- ఎన్టీఆర్ జిల్లాలో అధికార పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి
- ఏ ముఖం పెట్టుకుని 'సామాజిక న్యాయభేరి'కి వెళ్లాలని ఆవేదన
- నేడు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వైసీపీ బస్సుయాత్ర

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ :
ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నాదమ్ములకు మూడు కీలక పదవులు... మరొక కుటుంబంలో వదిన, మరిదికి పదవులు... ఒకరికే రెండు పదవులు... ఇలా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కొందరినే ప్రభుత్వ పదవులన్నీ వరించాయి.

వైసీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పని చేసినవారిని, ఎన్నికల సమయంలో పదవులు ఆశచూపి పార్టీలో చేర్చుకున్నవారిని నేటికీ పట్టించుకోలేదు. దీంతో అధికార పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఒక్కరికే రెండు పదవులు, ఒకే కుటుంబంలో రెండు, మూడు పదవులు ఇవ్వడమేనా సామాజిక న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ఒకరిద్దరు నాయకులు తమ నియోజకవర్గాల్లో పరిస్థితిపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. తమకన్నా వెనక వచ్చినవారు లాబీయింగ్ ద్వారా పదవులు తన్నుకుని వెళుతున్నారని పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు చేపట్టిన - మిగతా 2 లో

ఆర్థిక మాంద్యం ముప్పు

- రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం
- అధిక టోకు ద్రవ్యోల్బణం ఒత్తిడే కారణం
- ఆహార, నిత్యావసర, ఇతర వస్తువుల ధరలకు రెక్కలు
- ఆర్‌బీఐ హెచ్చరిక
- వృద్ధి అంచనాలకు ఏజెన్సీల కోత

న్యూఢిల్లీ :
దేశంలో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. పెరుగుతున్న ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం ఛిద్రమయింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నామమాత్రపు చర్యలతో సరిపుచ్చుతోంది. ఇది అంతిమంగా ఆర్థిక మాంద్యం దిశకు తీసుకువెళుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అధిక టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యుపీఐ) రిటైల్ ద్రవ్యోల్బణంపై ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం హెచ్చరించింది. మరోవైపు, దేశంలో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందని అంతర్జాతీయ, జాతీయ కీలక సంస్థల విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. అధిక పారిశ్రామిక ముడిసరుకు ధరలు, రవాణా ఖర్చులు, అంతర్జాతీయ రవాణా, సరఫరా గొలుసు అడ్డంకుల నుంచి అధిక వ్యయ ఒత్తిళ్లు ప్రధాన ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతున్నాయని ఆర్బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 'తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణంలో తీవ్ర పెరుగుదల మధ్య టోకు, రిటైల్ ధరల ద్రవ్యోల్బణం మధ్య గణనీయమైన చీలిక రిటైల్ ద్రవ్యోల్బణానికి ఉత్పత్తి ఖర్చుల ఒత్తిళ్లకు దారితీసే ప్రమాదాన్ని కలిగిస్తుంది' అని కేంద్ర బ్యాంకు - మిగతా 2 లో

కళారూపాలతో ప్రజాచైతన్యం

కళను మించిన ఆయుధం లేదు

- వామపక్ష భావజాలం కలిగిన కళాకారులంతా ఏకం కావాలి
- ప్రజానాట్యమండలి కళా ఉత్సవాల్లో ఇప్టా ఉపాధ్యక్షులు కందిమళ్ల
- జెండా ఆవిష్కరించిన అన్న

అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రతినిధులు నల్లూరి, గని, ప్రతాప్‌రెడ్డి, విమలక్క, శ్రీనివాస్, పీజే చంద్రశేఖర్, ఓబులేశు, చంద్రానాయక్, జయలక్ష్మి తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - కడప :
కళాకారులు తమ కళారూపాలతో ప్రజాచైతన్యానికి కృషి చేయాలని ఇప్టా ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. దాస్య శృంఖలాల నుంచి విముక్తి పొందేందుకు బ్రిటీష్, నిజాం పాలకుల గుండెల్లో నిలిచిన కళాకారులు తమ కళలతో ప్రజాచైతన్యానికి విశేష కృషి చేశారని, నేడు అదే స్ఫూర్తితో వామపక్ష భావజాలం కలిగిన కళాకారులంతా ఏకమై భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు, రాష్ట్ర స్థాయి కళాఉత్సవాలు రెండవ రోజు శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం (కమ్మసాహెబ్, శ్యామలదేవి కళా ప్రాంగణం)లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క, ప్రజానాట్య మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, అధ్యక్షులు గని తదితరులు పాల్గొన్నారు. ముందుగా నల్లూరి వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరణ గావించారు. అనంతరం అమరవీరుల స్థూపాన్ని ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఫోటో ప్రదర్శనను విమలక్క ప్రారంభించారు. ప్రతినిధులనుద్దేశించి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్యమండలి చరిత్ర వివరించారు. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు తమ కళారూపాల ద్వారా కళాకారులు విశేష కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం నిజాం, దొరల నిరంకుశ పాలనను ఎండగట్టడానికి, మూఢ నమ్మకాలను, రాజుల పాలనను రూపుమాపడానికి కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. కళారూపాల శక్తికి ఎలాంటి ఆయుధాలు ధీటు కావన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజలను అనేక సమస్యలను గురిచేస్తున్నాయని, వాటి కబంధ హస్తాల నుంచి ప్రజలను మేలు కొల్పడానికి కళాకారులు కృషి చేయాలని ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు.

నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ ప్రజా సమస్యలను కళలు, పాటల రూపంలో తీసుకువచ్చి ప్రజల్లో జవసత్వాలు నింపడం ప్రజా కళాకారులకే చెల్లు అన్నారు. 1943లో బడుగు, బలహీనవర్గాల, కష్ట జీవుల కోసం 'మా భూమి' నాటికను ప్రదర్శించడం అప్పట్లో పెద్ద ఉత్సాహాన్నిచ్చిందన్నారు. జానపదాలు, బుర్ర కథల కళారూపాల ద్వారా బడుగు బలహీన తాడిత పీడిత - మిగతా 2 లో

ఇదీ లోకం!

గిన్నిస్ బుక్ వాళ్ళు సార్,
అత్యంత ఎక్కువగా కరెంటు పోతున్న రాష్ట్రంగా
మనల్ని నమోదు చేస్తారట! మీకు ఓకేనా!?

క్షీణించిన విద్యా ప్రమాణాలు

- తెలుగు రాష్ట్రాలోనూ ఇదే పరిస్థితి
- నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ :
దేశంలో విద్యా ప్రమాణాలు క్షీణించాయి. పంజాబ్, రాజస్థాన్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2017 కంటే ముందు స్థాయికి విద్యా ప్రమాణాలు పడిపోయాయని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2021 తాజాగా వెల్లడించింది. అయితే కొవిడ్ మహమ్మారి ఇందుకు ప్రధాన కారణమై ఉంటుందని సర్వే తెలిపింది. దేశంలోని 720 జిల్లాల్లో ఉన్న 1.18 లక్షల పాఠశాలలను పరిశీలించిన అనంతరం తాజా సర్వే నివేదికను రూపొందించినట్లు ఎన్ఏఎస్ పేర్కొంది. 34 లక్షల మంది విద్యార్థులు ఈ సర్వే పాల్గొన్నారు. ఇదిలాఉండగా, పిల్లల విద్యాభ్యాసం విషయంలో కనీసం 25 శాతం పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు లేదని సర్వేలో గుర్తించారు. 3 నుంచి 5వ తరగతి స్థాయిలో గణితం, భాషా నైపుణ్యాలు, పర్యావరణ శాస్త్రం వంటి విషయాలపై పరిశీలన చేసినట్లు వివరించింది. అయితే

పంజాబ్, రాజస్థాన్ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 2017 నాటి దేశ సగటు కంటే తక్కువ ప్రమాణాలు నమోదయ్యాయని పేర్కొంది. ఈ విషయంలో తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు చివరి స్థానాల్లో ఉన్నాయని తెలిపింది. అయితే 5వ తరగతి స్థాయిలో జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ కొంత మెరుగ్గా - మిగతా 2 లో

హడావుడితో అనర్థం

- 25వేల మందికి గుండెకోత
- సచివాలయ ఉద్యోగ నియామకాల్లో అధికారుల నిర్వాకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన శాఖా పరమైన పరీక్షల్లో అదనపు సిలబస్, పేపర్లతో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు దాదాపు 25వేల మంది ఉద్యోగాల క్రమబద్ధీకరణ అవకాశాన్ని కోల్పోయారు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హడావుడిగా గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టింది. దీని ద్వారా స్థానికంగా ప్రజా సంక్షేమం, ప్రభుత్వ కార్యకలాపాలను సులభతరం చేసింది. వాటి నిర్వహణ కోసం దాదాపు లక్షా 35వేల మంది సిబ్బందిని పోటీ పరీక్ష ద్వారా ఎంపిక చేసింది. వారందరి ఉద్యోగాలను రెండేళ్ల తర్వాత క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అనుకున్న తరహాగానే రెండేళ్ల తర్వాత గ్రామ/వార్డు

సచివాలయ ఉద్యోగులను శాఖాపరమైన పరీక్షలతోనే ఎంపిక చేస్తామంటూ ప్రభుత్వం మెలిక పెట్టింది. దాంతో చాలా మంది ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు అనుగుణంగా ఏపీపీఎస్సీ ద్వారా శాఖా పరమైన పరీక్షలను సచివాలయ వ్యవస్థలోని వివిధ విభాగాల సిబ్బంది రాసి, అర్హత సాధించారు. అదే కోవలో చాలా మందికి అర్హత కల్పించకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. అటు గ్రామ/వార్డు సచివాలయ - మిగతా 2 లో

రష్యా ఒంటరి కాదు: పుతిన్

మాస్కో : రష్యాను ఒంటరి చేయడం అసాధ్యమని పుతిన్ పశ్చిమ దేశాలను హెచ్చరించారు. రష్యాను ఏకాకిని చేసేందుకు ప్రయత్నిస్తున్న దేశాలు ప్రధానంగా తమ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే హాని కలిగిస్తున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. మొదటి యురేషియన్ ఎకనామిక్ ఫోరమ్ ప్లీనరీ సెషన్‌లో పుతిన్ ప్రసంగిస్తూ, రష్యాను ఒంటరిగా చేయడం అసాధ్యమని "అలా చేయాలనుకునే వారు తమను తాము ఎక్కువగా నష్టపరుచుకోవడమేనని" హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిలో రష్యా స్థానం సరైనదని, సమర్థనీయమని పుతిన్ స్పష్టం చేశారు. దూరదృష్టి లేని విధానాలను అనుసరిస్తున్న దేశాల్లో దవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతూనే ఉన్నాయని, లాజిస్టిక్ చైన్‌లు విచ్ఛిన్నమవుతున్నాయని, ఆహార రంగం వంటి రంగాలలో ప్రపంచ సంక్షోభాలు తీవ్రమవుతున్నాయని అన్నారు. "ఇది మొత్తం ఆర్థిక, రాజకీయ సంబంధాల వ్యవస్థను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య" గా పుతిన్ పేర్కొన్నారు. స్వతంత్ర విధానాలను అనుసరించాలనుకునే దేశాలను ప్రధానంగా బలహీనపరచడం లక్ష్యంగా పెట్టుకుని వాటిపై ఆంక్షలు విధించడం వ్యర్థమని పుతిన్ ఆగ్రహం వెలిబుచ్చారు. "స్వతంత్ర విధానాల్ని అనుసరించాలనుకుని అనుసరించే దేశాలు అనేకం ఉన్నాయి... ఈ ప్రక్రియను ఎవరూ ఆపలేరు ..స్వతంత్ర విధానాలను అనుసరించాలనుకునే దేశాలను ప్రధానంగా బలహీనపరచడం లక్ష్యంగా పెట్టే ఆంక్షలు అంతిమంగా వ్యర్థమని పుతిన్ స్పష్టం చేశారు.

పశ్చిమ దేశాలు రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తే, ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఆహార సంక్షోభాన్ని నివారించడానికి తాము సహకారం అందించడానికి సిద్ధమని పుతిన్ ఇటలీ ప్రధాన మంత్రి మారియో డ్రాగీతో టెలిఫోన్ కాల్‌లో తెలిపారు. పశ్చిమ దేశాలు రాజకీయ ఆంక్షలను ఎత్తివేసేందుకు సిద్ధమైతే ఆహారధాన్యాలు, ఎరువుల ఎగుమతి ద్వారా ఆహార సంక్షోభాన్ని అధిగమించడానికి రష్యన్ ఫెడరేషన్ సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని పుతిన్ నొక్కిచెప్పారు. అజోవ్, నల్ల సముద్రం ఓడరేవుల నుండి మానవతా కారిడార్‌లను రోజువారీ తెరవడంతోపాటు, నావిగేషన్ సంబంధించిన భద్రత అంశాలపై పుతిన్ మాట్లాడారు.

బుకర్ ప్రైజ్ విజేత గీతాంజలిశ్రీ

లండన్: భారత రచయిత్రి గీతాంజలి శ్రీ రాసిన 'రేత్ సమాధి' కి ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ లభించింది. ఢిల్లీకి చెందిన గీతాంజలి శ్రీ హిందీ నవలా, లఘు కథా రచయిత్రి. ఆమె రాసిన రేత్ సమాధి(2018) ఆంగ్ల తర్జుమా 'టూంబ్ ఆఫ్ శాండ్'కు 2022కుగాను ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ లభించింది. టూంబ్ ఆఫ్ సాండ్ అనేది అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ గెలుచుకున్న భారతీయ భాషలో వ్రాసిన మొదటి పుస్తకం. పైగా హిందీ నుండి అనువదించబడిన మొదటి నవల. బుకర్‌ప్రైజ్ గౌరవం అందుకున్న తొలి భారత రచయిత్రి గీతాంజలి శ్రీ. గురువారం లండన్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో గీతాంజలి శ్రీ(64)కి బహుమతి పురస్కారం అందించారు. గీతాంజలితో పాటు 'రేత్ సమాధి'ని ఇంగ్లీష్‌లోకి అనువదించిన డైసీ రాక్‌వెల్(అమెరికా)కు కలిపి ఈ పురస్కారం లభించింది. యాభై వేల బ్రిటిష్ స్టెర్లింగ్ పౌండ్లను క్యాష్ ప్రైజ్‌గా అందించడమైంది.

'రేత్ సమాధి' ఉత్తర భారతంలో ఎనభై ఏళ్ల వృద్ధురాలి కథ. వృద్ధురాలు తన భర్త మరణంతో తీవ్ర డిప్రెషన్‌లోకి జారుకుంటుంది. ఆపై ఆమె జీవితం కొత్త మారుతుంది.. అది ఎలా అనేది కథా వృత్తాంతం. బుకర్ ప్రైజ్ వస్తుందని కలలలో కూడా ఊహించలేదు. సాధిస్తా అనుకోలేదు. ఇది ఒక గొప్ప గౌరవం. అద్భుతంగా ఉంది. గర్వంగా ఉంది అని గీతాంజలి శ్రీ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆమె ఐదు నవలలు రాయగా, మయి(2000) క్రాస్‌వర్డ్ బుక్ అవార్డు 2001కి నామినేట్ అయ్యింది. భారతీయ ప్రముఖ రచయిత ప్రేమ్‌చంద్‌పై విమర్శనాత్మక రచన కూడా చేసారు. చిన్నతనంలో పిల్లల పుస్తకాలు ఎక్కువగా ఆంగ్లంలో లేకపోవడంతోనే తాను హిందీపై మక్కువ పెంచుకోవాల్సి వచ్చిందని ఆమె చెప్పారు. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనల ఆధారంగా రాసిన హమారా షహర్ ఉస్ బరాస్ విమర్శలకు ప్రశంసలు అందుకున్నారు. డైసీ రాక్‌వెల్.. అమెరికన్ రచయిత,అనువాదకురాలు మాత్రమే కాదు.. పెయింటర్‌గా కూడా పాపులర్. ఉర్దూ, హిందీ నవలలను, రచలను ఎన్నింటినో ఆమె ఆంగ్లంలోకి అనువదించారు. మొత్తం 135 పుస్తకాలను యూకేకు చెందిన ఈ అంతర్జాతీయ సాహిత్య వేదిక జ్యూరీ పరిశీలించగా ఆరు పుస్తకాలు బుకర్ ప్రైజ్ కోసం పోటీలో నిలిచాయి. అందులో టూంబ్ ఆఫ్ శాండ్‌కు ఈ గౌరవం దక్కింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఇదెక్కడి సామాజికన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

'సామాజిక న్యాయ భేరి యాత్ర'లో తాము ఏ ముఖం పెట్టుకుని పాల్గొనాలని ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పదవుల పంపకాల పరిస్థితి..!

- నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఉన్నారు. ఆయన తమ్ముడు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌కు తొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఇచ్చారు. అరుణ్‌కుమార్ ఆ పదవిలో కొనసాగుతుండగానే ఇటీవల ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వడం విశేషం. దీంతో అన్నాదమ్ములకు మూడు కీలక పదవులు దక్కాయి.
- గొల్లపూడికి చెందిన తలశిల రఘురాం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా కేబినెట్ హోదాతో కొనసాగుతున్నారు. ఆ పదవితోపాటు ఆయనకు శాసనమండలి సభ్యుడిగా కూడా అవకాశం కల్పించారు.
- విజయవాడకు చెందిన రహుల్లా వదిన కార్పొరేటర్‌గా ఉన్నారు. రహుల్లా తల్లి కరీమున్నీసాకు అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆమె ఆకస్మింగా మరణించడంతో రహుల్లాను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. ప్రస్తుతం రహుల్లా ఎమ్మెల్సీగా ఉన్నారు.
- విజయవాడకు చెందిన కార్పొరేటర్ బండి పుణ్యశీలకు మేయర్ పదవి దక్కుతుందని అందరూ భావించినా, అనూహ్యంగా రాయన భాగ్యలక్ష్మిని మేయర్‌గా ఎంపిక చేశారు. దీంతో పుణ్యశీల తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఆమెకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవికి కేటాయించారు.
- విజయవాడలో కార్పొరేటర్‌గా ఉన్న అడపా శేషుకు ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు.

వీరిని పట్టించుకోరా...!

- వైసీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలో డాక్టర్ దుట్టా రామచంద్రరావు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి మిత్రుడు అయిన రామచంద్రరావు తొలి నుంచి వైఎస్ జగన్‌కు అండగా నిలిచారు. ఆయన 2014లో గన్నవరం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయినా ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగానే ఉన్నారు. గత ఎన్నికల్లో అమెరికా నుంచి వచ్చిన యార్లగడ్డ వెంకట్రావుకు వైసీపీ సీటు ఇచ్చినా ఆయనకు అండగా నిలిచారు. స్వల్ప తేడాతో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వల్లభనేని వంశీపై వెంకట్రావు ఓడిపోయారు. వెంకట్రావును నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించి, కేడీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల్లో వంశీ వైసీపీకి మద్దతు తెలియజేయడంతో ఇటీవల ఆయనకే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో యార్లగడ్డ వెంకట్రావు రాజకీయాల నుంచి దాదాపు కనుమరుగయ్యారు. దుట్టా రామచంద్రరావు మాత్రం నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకులకు అన్యాయం జరుగుతోందని పోరాటం సాగిస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. దీనిపై వైసీపీ అధిష్టానం చర్చలు జరుపుతోంది. మరోవైపు దుట్టా రామచంద్రరావు కోడలు బాపులపాడు జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు జెడ్పీ చైర్‌పర్సన్ పదవి లభిస్తుందని ఆశించినా నిరాశేమిగిలింది.
- విజయవాడ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి 2019 ఎన్నికలకు కొద్దికాలం ముందు వైసీపీలో చేరారు. ఆయన విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అనూహ్యంగా అప్పట్లో కార్పొరేటర్‌గా ఉన్న బొప్పన భవకుమార్‌కు విజయవాడ తూర్పు సీటు కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర స్థాయి పదవి ఇస్తామని అప్పట్లో రవికి హామీ ఇచ్చారని సమాచారం. కానీ నేటికీ ఆయనను పట్టించుకోలేదు. ఆయన కూడా ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు.
- వైసీపీ ఆవిర్భావం నుంచి జిల్లాలో క్రియాశీలకంగా పని చేసిన మైనారిటీ నాయకుల్లో డాక్టర్ మెహబూబ్ షేక్ ఒకరు. ఆయన వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాటి నుంచి నేటి వరకు కొనసాగుతున్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో సుమారు నాలుగేళ్లు ప్రతి వారం క్రమం తప్పకుండా ఉచిత వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు, మెగా మెడికల్ క్యాంపులు పెద్ద సంఖ్యలో నిర్వహించారు. ఉన్నత విద్యావంతుడైన డాక్టర్ మెహబూబ్ షేక్ ఇప్పటికీ వైసీపీ తరఫున జాతీయ మీడియా చర్చల్లో పాల్గొంటున్నారు. అయినా ఆయనకు ఎటువంటి పదవి లభించలేదు.
- వైసీపీ కార్పొరేటర్‌గా, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా సేవలు అందించడంతోపాటు ప్రస్తుతం విజయవాడ నగర అధ్యక్షుడిగా ఉన్న బొప్పన భవకుమార్‌కు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ ఆయనకు కూడా నేటికీ ఏ పదవి ఇవ్వలేదు.
- వీరితోపాటు మరికొందరు నియోజకవర్గ స్థాయి నేతలు కూడా నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో తమ అధిష్టాన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.
- ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మంత్రులు చేపట్టిన సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర కృష్ణా జిల్లాలోకి ప్రవేశించనుంది. మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద సభ నిర్వహించనున్నారు. ఈ సభలో ఎటువంటి వ్యతిరేకత కనిపించకుండా జయప్రదం చేసేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సీపెట్ కోర్సులకు ప్రవేశానికి జూన్ 5లోగా దరఖాస్తు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) అందించే డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ ఉత్తీర్ణులైనవారితో పాటు, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసినవారు కూడా అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500 ఒఒఒ.ఎఱజూవ.స్రశీఐ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విజయవాడ, అనంతపురం కేంద్రాల్లో జూన్ 19వ తేదీ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సదుపాయం, విద్యార్థినీ,విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి సౌకర్యం ఉందని, ఇతర వివరాలకు బి.కిరణ్‌కుమార్ సెల్ నెంబరు 99859 41979 సంప్రదించాలని కోరారు.

తప్పుడు ప్రచారాలపై అమెరికాకు చైనా హెచ్చరిక

బీజింగ్ : తమపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని చైనా అమెరికాను హెచ్చరించింది. చైనా ప్రభావాన్ని ప్రతిఘటించడానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిస్తూ అమెరికా విదేశాంగమంత్రి చేసిన ప్రసంగంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా విరుచుకుపడింది. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం కూడదని పేర్కొంది. చైనా అభివృద్ధిని అణచివేయడానికి అమెరికా కుయుక్తులు చేస్తోందని తెలిపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన రంగాల్లో చైనా దూసుకుపోవడంతో అమెరికా సాంకేతిక ప్రమాణాల పేరుతో యూరోపియన్‌యూనియన్‌తో ఫోరమ్‌ను ఏర్పాటుచేసింది. ప్రపంచ దేశాల ముందు తమను ఏకాకిని చేసే లక్ష్యంతో అమెరికా ఉందని పేర్కొంది. మొత్తం ప్రపంచ వ్యవస్థనే బలహీన పరిచేలా చైనా వ్యవహరిస్తోందని అమెరికా విదేంశగ మంత్రి ఆంటోనీ బ్లింకన్ విరుచుకుపడ్డారు. అమెరికా విదేశాంగ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతోనే చైనా తీవ్రంగా మండిపడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి చైనాను వేరు చేసే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని, చైనా మాత్రం అంతర్జాతీయ ప్రమాణాలను కచ్చితంగా ఫాలో కావాలని తేల్చి చెప్పింది. తమ ప్రతిష్ఠను దిగజార్చొద్దని, తమకు కళంకం తెచ్చేలా వ్యాఖ్యలు చేయవద్దని చైనా విదేశాంగ శాఖ అమెరికాను తీవ్రంగా హెచ్చరించింది.

క్షీణించిన విద్యా ప్రమాణాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని పేర్కొంది. అలాగే 8వ తరగతి స్థాయిలో గణితం, భాషా నైపుణ్యం, సైన్స్, సోషల్ లాంటి అంశాలను పరిశీలించగా అక్కడ కూడా ఇవే ఫలితాలు వచ్చాయని, ఈ స్థాయిలో చత్తీస్‌గఢ్ కొంత మెరుగ్గా ఉన్నట్లు ఎన్ఏఎస్ వెల్లడించింది.

బడికెళ్లాలంటే కాలి నడకే శరణ్యం

దేశవ్యాప్తంగా 48 శాతం మంది విద్యార్థులు కాలినడకనే పాఠశాలలకు వెళుతున్నట్లు సర్వేలో తేలింది. 18 శాతం మంది సైకిళ్లపై పాఠశాలలకు చేరుకుంటుండగా, పాఠశాల రవాణా, ప్రజా రవాణాను ఉపయోగించుకుంటున్నవారు కేవలం 9 శాతం మంది ఉన్నారు. 8 శాతం మంది సొంత వాహనం (ద్విచక్ర) పై, 3 శాతం మంది సొంత కార్లలో పాఠశాలలకు వెళుతున్నారని తెలిపింది.

రాక్షస పాలనకు చరమగీతం

(మొదటిపేజీ తరువాయి)

మహానాడు ప్రారంభ ఉపన్యాసాన్ని చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తూ రాష్ట్రంలో వైసీపీ పాలనపై నిప్పులు చెరిగారు. తెలుగుదేశం పార్టీ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సమయంలో జరుగుతున్న మహానాడు రాష్ట్రానికి దశ దిశ నిర్దేశించే విధంగా ఉండాలని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం ఆవిర్భావానికి ముందు, తరువాత అని చెప్పుకునే స్థాయికి తెలుగుదేశం ఎదిగిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులు చేసి తమ పైనే కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తే ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని ఆయన అన్నారు. నాడు రౌడీలను అణచివేసిన పోలీసు వ్యవస్థ ఇప్పుడు ఉన్మాది పాలనలో గాడితప్పిందని చెప్పారు. జగన్‌ను నమ్ముకున్న అధికారులు సైతం జైలుకెళ్లారని, జగన్ మాటలు విని అధికారులు తప్పు చేస్తే ముస్ముందు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పన్నులు, ధరలు... ప్రజలపై బాదుడే బాదుడుతో జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, రైతులకు జగన్ పాలనలో తీవ్ర ద్రోహం జరిగిందని, కనీస గిట్టుబాటు ధర అందలేదని తెలిపారు. గతంలో రూ.50 వేల రుణ బాకీ చేస్తే జగన్ రూ.7 వేలు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. జగన్ చెప్పిన మద్య నిషేధం ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రానికి 8 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారని, ఇక అభివృద్ధి ఎక్కడ ఉందని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక, సిమెంటు, స్టీలు ధరలు పెరిగి పేదవాడు ఇళ్లు కట్టుకునే పరిసితి లేదని అన్నారు. మూడేళ్లలో మూడు ఇళ్లు కట్టిన జగన్ ఇప్పుడు 30 లక్షల ఇళ్లు కడతానని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, టీడీపీ హయాంలో 25 వేల కిలోమీటర్ల రోడ్లు వేస్తే జగన్ హయాంలో రెండు కిలోమీటర్లు కూడా వేయలేదని తెలిపారు. మరలా వర్షాకాలం వస్తుందని, రోడ్లపై నాట్లు వేసి చేపలు కూడా పట్టవచ్చని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రజలు సీఎం సీఎం అంటూ నినాదాలు ఇస్తున్నారని... నాకు సీఎం పదవి కొత్త కాదని... రాష్ట్రం కోసమే నా పోరాటం అని అన్నారు. ఒక్క ఛాన్స్ అని జగన్‌కు అవకాశం ఇస్తే కరెంటు తీగను ఒక్కసారి పట్టుకుంటే ఏమైందో అదే అయిందని తెలిపారు. డ్రైవర్‌ను చంపిన ఎమ్మెల్సీని రక్షించేందుకే ప్రశాంతంగా ఉన్న కోనసీమలో అల్లర్లు సృష్టించి కులాల మధ్య చిచ్చు పెట్టింది జగన్‌మోహన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు బాబాయి హత్యను గుండెపోటుగా మార్చి జగన్ సానుభూతి పొందాడని, గుండెపోటు కాదు... గొడ్డలిపోటు కథ ఏమైందని ప్రశ్నించారు. కోడికత్తి ఒక డ్రామాగా చేసిన జగన్... అధికారం కోసం చెల్లిని, అమ్మను కూడా దూరం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రం ఒక ఉన్మాది చేతిలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. దీనికోసం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో రాష్ట్ర భవిష్యత్తు దిశ దశ కావాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, ఈ తెలుగుదేశం మరో 40 ఏళ్లు సమర్థంగా పని చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో 40 శాతం సీట్లు యువతకు ఇచ్చి ప్రోత్సహిస్తామని అన్నారు. జగన్ రాజకీయాల నుంచి దిగిపోతే తప్ప ఈ రాష్ట్రానికి మంచి రోజులు రావని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఒకటే పిలుపునిస్తున్నా క్విట్ జగన్... సేవ్ ఆంధ్రప్రదేశ్, ఇదే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహానాడులో మాజీ మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు 17 అంశాలపై ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర, చినరాజప్ప, పితాని సత్యనారాయణ, యనమల రామకృష్ణుడు, రావుల చంద్రశేఖర్, ఎంపీ రామ్మోహన్ నాయుడు, అనిత, కళావెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర, దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డి, సాయికల్పనారెడ్డి, పమిడి రమేష్, సుహాసిని, ఉమ్మడి సంధ్యారాణి, జనార్ధన్‌రెడ్డి, రవిచంద్ర, శ్రావణ్, గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నల్లూరి, పీజే చంద్రశేఖర్, చంద్రానాయక్, గని, బాబ్జీ, పిచ్చయ్య తదితరులు

కళారూపాలతో ప్రజాచైతన్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలలో ధైర్యాన్ని నింపి ముందడుగు వేసిందన్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటి కళాకారులు ఎందరో ఉన్నారని వారిలో అల్లు రామలింగయ్య, జమున, వంగపండు, నాగభూషణం తదితరులు అందరూ బతకాలి, భూభాగోతం వంటి నాటికల ద్వారా ప్రజలను చైతన్యపరిచారన్నారు. విమలక్క మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి నక్సల్‌బరి వరకు ఉద్యమాలకు ఊపిరి పోసింది కళాకారులేనన్నారు. ఫ్యాక్షనిజం, పీడిత తాడిత వర్గాలపై దాడులను అరికట్టడంలో ముందడుగు వేయడానికి కళలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను ఛిద్రం చేస్తూ నేటి సమాజంలో ఆటవిక, అరాచక పాలన కొనసాగుతోందన్నారు. సమావేశం మధ్యలో విమలక్క పాడిన పాటలు ప్రతినిధులను ఆలోచింపచేశాయి. శ్రీనివాస్ మాట్లాడుతూ రజాకర్ల పాలనను అంతమొందించడానికి ప్రజానాట్య మండలి కళలు ఎంతో ఉపయోగపడ్డాయని, దానికి నిదర్శనం తెలంగాణ సాయుధ పోరాటమేనని అన్నారు. రాబోయే తరానికి కళారూపాలను అందించాలంటే పాఠశాలల నుంచే కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వి.జయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కళలు అసలు రూపును కోల్పోయి పెడదారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పాటలు, సినిమాలు, ప్రజలను రంజింపచేసేవి కాకుండా ప్రలోభాలకు లోనయ్యే విధంగా ఉండడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. నేడు సాహిత్యం భ్రష్టు పట్టిపోయి అశ్లీలతతో కూడుకున్నదని, దీన్ని అంతమొందించడానికి నేటి యువత కంకణబద్ధులై ముందుకు సాగాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు రామకృష్ణ, లక్ష్మణరావు, చంద్రశేఖర్, నిస్సార్, జాకబ్, సినీ దర్శకులు బాబ్జీ, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పులి కృష్ణమూర్తి, నాగసుబ్బారెడ్డి, బషీరున్నిసా, సుబ్బారెడ్డి, రమణ, రైతు సంఘం నాయకులు గాలిచంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

హడావుడితో అనర్థం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేసి, జులై నుంచి పే స్కేల్ ప్రకారం వేతనాలు ఇస్తామని సీఎం జగన్ ప్రకటించిన విషయం విదితమే. ఆ మేరకు సచివాలయ ఉద్యోగులంతా శాఖాపరమైన పరీక్షల్లో అర్హత సాధించలేక పోయారు. అధికారుల గణాంకాల ప్రకారం దాదాపు సగం మంది శాఖాపరమైన పరీక్షల్లో అర్హత సాధించలేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో వారి ఉద్యోగాల క్రమబద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారింది.

ఏపీపీఎస్సీ మొక్కుబడిగా 3 పరీక్షలే

ఏపీపీఎస్సీ అధ్వర్యంలో రెండేళ్లల్లో ఐదు విడతలు గా శాఖాపరమైన (డిపార్టుమెంట్) పరీక్షల్ని నిర్వహించాల్సి ఉండగా, కేవలం మూడు పరీక్షల తోనే సరిపెట్టారు. దీంతో గ్రామ/వార్డు సచివాలయానికి చెందిన సిబ్బంది శాఖాపరమైన పరీక్షల్లో అనర్హత సాధించారు. వేలాది మంది తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఏపీపీఎస్సీ మొదటగా నిర్వహించిన పరీక్షల్లో చాలా మంది ఉద్యోగులు కరోనా విధుల్లో ఉండి, దరఖాస్తు చేసుకోలేక పోయారు. కొంతమంది దరఖాస్తు చేసుకున్నప్ప టికీ, కరోనా విధుల ఒత్తిడితో పరీక్షలకు హాజరుకాలేక పోయారు. రెండో విడత ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సచివాలయ చాలా మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకుని, పరీక్షలు రాశారు. ఈ పరీక్షకు ఏపీపీఎస్సీ అధికారులు వేగవంతంగా ఫలితాలు ఇవ్వాలనే ఉద్దేశంతో, సమాధాన పత్రాలపై అభ్యర్థుల అభ్యంతరాల్ని స్వీకరించకుండానే హడావుడిగా ఫలితాలను వెల్లడించారు. దీంతో చాలా మందికి అన్యాయం జరిగింది. ఉద్యోగులు ఒక్కటి, రెండు మార్కుల తేడాతో అర్హతను కోల్పోయారు. ఆ తర్వాత గ్రామ/వార్డు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఏపీపీఎస్సీ శాఖా పరమైన పరీక్షలు నిర్వహించింది. వారి కోసం 8 నుంచి 10 పేపర్లు రాసుకునేందుకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించలేదు. దీంతో దాదాపు 25 వేల మంది శాఖా పరమైన పరీక్షల్లో అర్హత సాధించలేక, వారి ఉద్యోగాల క్రమబద్ధీకరణకు దూరమవుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏపీపీఎస్సీ శాఖా పరమైన పరీక్షలు నిర్వహించినప్పటికీ, అందులో సిలబస్‌లో లేని ప్రశ్నావళి ఇవ్వడంతో కేవలం పది శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు ప్రకటించింది. ఈ విధానాలతో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు మళ్లీ అర్హత సాధించలేక పోయారు. మళ్లీ ఎప్పుడు ఏపీపీఎస్సీ శాఖా పరమైన పరీక్షల్ని నిర్వహిస్తుందో, వారి ఉద్యోగాల క్రమబద్ధీకరణ ఎప్పటికి పూర్తవుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

సిలబస్‌లోని ప్రశ్నలకు గ్రేస్ మార్కులు ఇవ్వాలి: ఏపీ జీడబ్ల్యూఎస్‌యూఎస్

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీపీఎస్సీ నిర్వహించిన గత శాఖా పరమైన(డిపార్టుమెంటల్) పరీక్షలకు సిలబస్‌లో లేకుండా వచ్చిన వాటికి గ్రేస్ మార్కులు ఇవ్వాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య (ఏపీ జీడబ్ల్యూఎస్‌యూఎస్) డిమాండు చేసింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ సెక్రటరీ అరుణ్‌కుమార్‌కు సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.గురుస్వామి అధ్యక్షురాలు కె.అనూరాధ తదితరులు శుక్రవారం వినతిపత్రాన్ని అందచేశారు.

రాబోయే శాఖాపరమైన పరీక్షలను ఏపీపీఎస్సీ తక్షణమే నిర్వహించి, ఫలితాలను సకాలంలో వెల్లడించాలని కోరారు.

జూన్ 20 నుంచి పరీక్షలు: ఏపీపీఎస్సీ

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు శాఖా పరమైన పరీక్షలను జూన్ 20 నుంచి నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. తనను కలిసిన గ్రామ, వార్డు సచివాలయ సమాఖ్య ఉద్యోగులకు ఈ మేరకు హామీ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులకు నిర్వహించే శాఖా పరమైన పరీక్షలలో 8, 10 పేపర్లను కుదించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక మాంద్యం ముప్పు...!

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించింది. ఉక్రెయిన్‌పై వివాదం, తత్ఫలితంగా నిత్యావసర ధరల పెరుగుదల ప్రపంచంలోని ఇతర దేశాల మాదిరిగానే భారతదేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీసిందని వివరించింది. పెరుగుతున్న ధరలను నియంత్రించడానికి, ప్రభుత్వం ఇటీవల పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించింది. స్టీల్, ప్లాస్టిక్ పరిశ్రమలలో ఉపయోగించే కొన్ని ముడి సామాగ్రిపై దిగుమతి సుంకాలను కూడా రద్దు చేసింది. అంతేకాకుండా ఇనుప ఖనిజం ఎగుమతి సుంకాన్ని పెంచారు. ఇంధనం నుంచి కూరగాయలు, వంట నూనె వరకు అన్ని వస్తువుల ధరల పెరుగుదల ఏప్రిల్‌లో డబ్ల్యూపీఐ లేదా టోకు ధరల ద్రవ్యోల్బణం రికార్డు గరిష్ఠ స్థాయి 15.08 శాతానికి, రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఎనిమిదేళ్ల గరిష్ఠ స్థాయి 7.79 శాతానికి చేరుకుంది. కాగా అధిక ద్రవ్యోల్బణం ఫలితంగా రిజర్వ్ బ్యాంక్ ఈ నెల ప్రారంభంలో బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 40 బేసిస్ పాయింట్లు 4.40 శాతానికి పెంచింది. అధిక టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఒత్తిడితో క్రమంగా ఆహార, నిత్యావసర, ఇతర అన్నిరకాల ధరలు పెరిగేందుకు అవకాశం ఉందని ఆర్‌బీఐ హెచ్చరించింది.

మార్చి త్రైమాసికంలో 3 శాతం దిగువనే : ఎస్‌బీఐ

దేశంలో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందని అంతర్జాతీయ, జాతీయ కీలక సంస్థల విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో నెలకొన్న అధిక ధరలకు తోడు అంతర్జాతీయ ప్రతికూల అంశాలు వృద్ధికి విఘాతంలా మారాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే జీడీపీ అంచనాలకు ఎస్‌బీఐ, మూడీస్, ఎస్‌అండ్‌పీ, ఇక్రా తదితర పరిశోధన సంస్థలు కోత పెట్టాయి. క్రితం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం(క్యూ4)లో భారత వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదల 2.7 శాతానికే పరిమితం కావొచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రధాన ఆర్థిక సలహాదారు సౌమ్యా కాంతి ఘోష్ వెల్లడించారు. ఆర్థిక సంవత్సరం 2021-22లో స్థూలంగా 8.5 శాతానికి అటూ, ఇటుగా జీడీపీ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మే 31న కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా జీడీపీ వివరాలను వెల్లడించనుంది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం 2020-21లో 8.9 శాతం వృద్ధి నమోదయింది. క్రితం క్యూ4లో పన్ను వసూళ్లలో బలమైన వృద్ధి నమోదు చేసుకుందనీ.. ఇది జీడీపీకి ప్రధాన మద్దతును అందించే అవకాశం ఉందని ఘోష్ తెలిపారు. అధిక ధరల ఒత్తిడి కార్పొరేట్ కంపెనీల నిర్వహణ లాభాలపై ప్రభావం చూపాయన్నారు. వాహన, సిమెంట్, కాపిటల్ గూడ్స్, విద్యుత్ ఉపకరణాలు, వంట నూనెలు తదితర రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. అధిక ద్రవ్యోల్బణం పై ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఘోష్ పేర్కొన్నారు.

ఉత్పత్తికి దెబ్బ : ఎస్‌అండ్‌పీ

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదల ఊహించినదానికంటే ఎక్కువ కాలం కొనసాగడంతో వృద్ధికి ప్రతికూలంగా మారిందని ప్రముఖ రేటింగ్ సంస్థ స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్‌అండ్‌పీ) వెల్లడించింది. మరోవైపు ఉక్రెయిన్ పరిణామాలు మరింత ఒత్తిడిని పెంచుతున్నాయని ఇటీవల విశ్లేషించింది. ఈ పరిణామాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో దేశ జీడీపీ 7.3 శాతానికి పరిమితం కానుందని అంచనా వేసింది. ఇంతక్రితం ఈ అంచనా 7.8 శాతంతో పోల్చితే భారీగానే కోత పెట్టినట్లయింది. వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది.

ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమే...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 8 శాతంగా ఉండొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. 8.2 శాతంగా నమోదు కావచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), 7.2 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ, 7.5 శాతానికి పరిమితం కావొచ్చని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సంస్థలు అంచనా వేశాయి. అధిక ధరలను ప్రభుత్వాలు కట్టడి చేయకపోవడంతో ప్రజల ఆర్థిక పరిస్థితి దెబ్బతిని.. ఆ ప్రభావం వెంటనే వృద్ధిపై పడటం సాధారణమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

డిమాండ్ మందగింపు : మూడీస్

హెచ్చు ద్రవ్యోల్బణంతో దేశంలో డిమాండ్ రికవరీ మందగించిందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ విశ్లేషించింది. తాజా గ్లోబల్ మైక్రో అవుట్‌లుక్ 2022-23లో భారత జీడీపీ అంచనాలకు కోత పెట్టింది. ముఖ్యంగా పెరుగుతున్న ముడి చమురు, ఆహార, ఎరువుల ధరలు కుటుంబాల ఆర్థిక పరిస్థితి, వ్యయంపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాది 2022 భారత జీడీపీ పెరుగుదల 8.8 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది.

కదలిన డొంక

- సంచలనం సృష్టించిన 'భూ దోపిడీ' కథనం
- మేల్కొన్న అధికారులు.. తక్షణమే చర్యలు
- 41మందికి నోటీసులు... 37 విద్యుత్ మీటర్లు సీజ్
- 28మంది ఇంటి పన్నుల రద్దు
- కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

ఆనందపురం మండలం, గంభీరం పంచాయతీలోని గువ్వలవారి కల్లాల్లో విలేకరులతో పేరుతో జరుగుతున్న భూదందాను 'విశాలాంధ్ర' బట్టబయలు చేసింది. ఈనెల 20న 'విలేకరుల పేరుతో భూ దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి.... ఇప్పటి వరకూ నిద్రావస్థలో ఉన్న అధికారులు మేల్కొన్నారు. తక్షణమే చర్యలు ప్రారంభించారు. ఈక్రమంలోనే 41మందికి నోటీసులు జారీ చేశారు. 37 విద్యుత్ మీటర్లు సీజ్ చేశారు. 28మందికి ఇంటి పన్నులు రద్దు చేస్తూ నోటీసులు పంపారు. ఈ చర్యలతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం, గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 145లోని ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిలో రియల్ దందాకు పాల్పడిన, ఓ పత్రికలో పనిచేస్తున్న విలేకరి, మరో నకిలీ విలేకరి, ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన లైన్‌మేన్‌ల పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ బాగోతంలో ఈ ముగ్గురు కోట్లు గడించారనీ, వీరికి నగరంలోని ఓ జర్నలిస్ట్ యూనియన్ నేత అండదండలు పుష్కలంగా ఉండబట్టే ఈ భారీ దోపిడీకి పాల్పడినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

అసలు విషయానికి వస్తే...

రియల్ దందాకు పాల్పడిన భూమి తాలూకు సర్వే నంబర్ 145 ముందుగా డి-పట్టా భూమి. ప్రభుత్వం భూసేకరణ అనంతరం అది ప్రభుత్వ గయ్యాల్లు భూమిగా మారింది. అనంతరం ఈ భూమిలో మూడు ఎకరాలకు నలుగురు డి-పట్టాదారులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చింది. మిగిలిన భూమికి సంబంధించి పరిహారం విషయంలో ప్రభుత్వంతో వివాదం నడుస్తోంది. ఇదిలా ఉంటే.. ఇదే డీ-పట్టా భూమిని నలుగురు లబ్దిదారులు ఓ నకిలీ విలేకరికి విక్రయించారు. అప్పటికి ఇది ఒక నిర్మానుష్య ప్రాంతం. దీంతో ఈ ప్రాంతంలో లేఅవుట్ వేసి ఈ స్థలాన్ని విక్రయించాలని సదరు నకిలీ విలేకరి నిర్ణయించాడు. అలా విక్రయించాలంటే ముందుగా విద్యుత్ సౌకర్యం ఉండాలి. దీంతో స్థానిక లైన్‌మేన్ సహకారం కోరాడు. విద్యుత్ లైన్ ఇస్తే 100 గజాల స్థలాలు రెండు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఇక్కడ వరకూ బాగానే సాగింది. ఇక ప్రభుత్వ అధికారులతో పని చేయించడం కోసం మధురవాడలో ఓ విలేకరి సాయం కోరారు. ఆ విలేకరి విషయం తెలుసుకుని తనకూ వాటా కావాలని, 100 గజాల స్థలం ఇవ్వాలని షరతు పెట్టాడు. ఈ షరతులో భాగంగానే సుగుణ కుమారి పేరు మీద 100 గజాల్లో నిర్మించిన రేకుల షెడ్డు పొందాడు. నకిలీ విలేకరి అప్పలకొండ పేరుమీద 200 గజాల్లో రేకుల షెడ్ నిర్మించాడు.

అంతా పక్కాగా...

ముందుగా సర్వే నంబర్ 145లో సొంత నిధులతో రోడ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలంలో చిన్నపాటి షెడ్లు నిర్మించి గంభీరం గ్రామ సచివాలయం నుంచి 50 ఇళ్లకు విద్యుత్ మీటర్లు తీసుకున్నారు. ఆపై ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలకు వీధిలైట్లు లేవంటూ విద్యుత్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడికి తలొగ్గిన అధికారులు విద్యుత్ స్తంభాలు, లైన్లు, లైట్లు ఉచితంగా వేశారు. ఆయా చర్యలతో కృత్రిమంగా ఓ గ్రామన్నే సృష్టించారు. అనుకున్నదే తడవుగా ఒక్కో షెడ్డును రూ.10 నుంచి 20 లక్షలకు విక్రయించుకుని కోట్లు గడించారు. వీటన్నింటిని గమనిస్తున్న అధికారులు, తాము ముందుగానే అందుకున్న తాయిలాలతో ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్టు వదిలేశారు. ఇక లైన్‌మేన్‌గా పనిచేస్తున్న వ్యక్తి సొంతిల్లు, కార్లు, ఫ్లాట్, బినామీ పేరుతో మరో ఫ్లాట్ పొందాడు. ఇదిలా ఉంటే... తాను పనిచేస్తున్న ఏపీఈపీడీసీఎల్‌కి కూడా పంగనామాలు పెట్టి, సంస్థకు భారీ ఎత్తున నష్టం కలిగించాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మేల్కొన్న అధికారులు

ప్రభుత్వ స్థలంలో కృత్రిమంగా ఏర్పాటు చేసిన ఈ గ్రామానికి సంబంధించి సిమెంట్ స్తంభాలు, వైర్లు, లైట్లు వేయడం ద్వారా ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టింది. ఇలా అంతా బాగా సాగుతున్న సమయంలో... ఈ వ్యవహారాన్ని 'విశాలాంధ్ర' బట్టబయలు చేసింది. వరుస కథనాలతో మేల్కొన్న అధికారులు 37మందికి విద్యుత్ మీటర్లు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ గడువుతో కూడిన నోటీసులు జారీ చేశారు. 28 మంది అక్రమంగా ఇంటిపన్నులు పొందినట్లు గ్రామ సచివాలయం అధికార్లు గుర్తించి అక్రమ పన్నులను రద్దు చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై స్థానిక తహశీల్దార్ వేణుగోపాల్ 41మంది ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. విచారణ నిమిత్తం క్షేత్రస్థాయిలోకి వచ్చిన రెవెన్యూ అధికారులకు అక్కడ దళితులెవరూ కనబడలేదు. అంతకుముందు తామంతా దళితులం.. ఇక్కడే నివసిస్తున్నాం అంటూ తహసీల్దార్ ఎదుట కొందరు కట్టుకథలు చెప్పారు. తీరా దీనిపై విచారణ చేయగా ఆ భూములో దళితులు తప్ప అగ్ర సామాజిక వర్గానికి చెందిన వారున్నారని విచారణలో తేలినట్టు అధికారులు తెలిపారు. తహసీల్దార్ అందించిన వివరాలు ప్రకారం పారుపల్లి బంగారయ్యకు 400 గజాలకి ఓ షెడ్ చొప్పున 4 షెడ్లు, మామిడి రమణకు 300 గజాలకి ఓ షెడ్ చొప్పున 3 షెడ్లు, పారుపల్లి పైడమ్మ, సోములమ్మ మామిడి బంగారమ్మలకు 250 గజాలు చొప్పున ఒక్కో షెడ్, నల్ల అప్పారావుకు 200 గజాలు చొప్పున 2 షెడ్లు, లండ వరలక్ష్మికి 150 గజాలు చొప్పున 2 షెడ్లు, మామిడి దేవి, భూసర అప్పయ్యమ్మ, సంకవల్లి ఆదిలక్ష్మిలకు 250 గజాలు చొప్పున 2 షెడ్లు, లాలం భవానీకి 200 గజాల్లో ఒక షెడ్, మిగిలిన వారందరికీ 100 గజాల్లో ఒక్కో షెడ్ నిర్మించి, మీటర్లు, ఇంటిపన్నులు మహిళల పేరు మీద పొంది ఆక్రమించినట్లు తహసీల్దార్ వివరించారు. ఇంతటి భూదందాకు పాల్పడిన ముగ్గురు రింగ్ మాస్టర్లను గుర్తించామని, త్వరలోనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, భూ ఆక్రమణదారులందరిపై పోలీసు కేసులు పెట్టి, భూములు స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

విత్తన పంపిణీకి సక్రమ చర్యలు చేపట్టాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రుతు పవనాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తుగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో, వ్యవసాయ రంగంలో రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాలకు అవసరమైన వేరుశెనగ విత్తన పంపిణీని ఆర్‌బీకే సెంటర్ల ద్వారా వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం అందించే వేరుశెనగ, సబ్సిడీ విత్తనాల ధర ప్రైవేటు వ్యాపారులు అందించే ధరకు ఏ మాత్రం తేడాలేదని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టంతోపాటు రైతాంగానికి ఏమాత్రం ప్రయోజం లేదని విమర్శించారు. గోదావరి, కృష్ణా, డెల్టాలతోపాటు ఇతర ప్రాజెక్టుల ద్వారా ముందస్తుగా సాగునీరు అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన వరి తదితర విత్తనాలను సరఫరా చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నకిలీ విత్తనాల అమ్మకాలను నిరోధించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలుల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి గుండెపోటు

మెరుగైన చికిత్సకోసం చెన్నైకి తరలింపు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గుండెపోటుకు గురయ్యారు. తన పాదయాత్రలో భాగంగా గడప గడపకు జగనన్న బాటలో ఆమంచర్లలో పర్యటిస్తుండగా మధ్యాహ్నం రెండు గంటలకు గుండెనొప్పి రావడంతో హుటాహుటిన నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శ్రీధర్‌రెడ్డిని పరీక్షించి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. ఈ విషయం తెలియడంతో రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆస్పత్రివద్ద అనుక్షణం ఉత్కంఠ పరిస్థితి ఏర్పడింది. విషయం తెలిసిన రాష్ట్ర వ్యవసాయ, సహకార మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అపోలో హాస్పిటల్‌కు చేరుకుని వైద్యులతో చర్చించి వెంటనే చెన్నైలోని అపోలో హాస్పిటల్‌కు తరలించాలని సూచించారు. శ్రీధర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి వెంకటగిరి నుంచి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి, అపోలో వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ప్రజా నాయకుడిగా నిత్యం ప్రజలతో మమేకమై ఉండే శ్రీధర్‌రెడ్డి అనారోగ్యానికి గురయ్యారన్న విషయం తెలుసుకుని నెల్లూరు రూరల్‌లోని ప్రజలు అతని ఆరోగ్యం కుదుటపడి త్వరగా కోలుకోవాలని దేవాలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో ప్రార్ధనలు చేశారు. రూరల్ ప్రాంతంలో శ్రీధర్‌రెడ్డి 47 రోజులుగా గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే అపోలో ఆస్పత్రి వైద్యులు ఆయన ఆరోగ్యం విషయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొంత విశ్రాంతి, మెరుగైన వైద్యం కొరకు చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలిస్తున్నామని కుటుంబసభ్యులకు తెలిపారు.

మహనీయుల పేర్లతో లబ్ధిపొందాలనుకుంటే

చరిత్రహీనులవుతారు

సామాజిక ఉద్యమకారులు లక్ష్మీనారాయణ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మహనీయుల పేర్లను సంకుచిత రాజకీయాల ఊబిలోకి లాగి, లబ్ధి పొందాలని ఎవరు ప్రయత్నించినా చరిత్రహీనులుగా మిగిలిపోతారని ప్రముఖ సామాజిక ఉద్యమకారులు టి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా పేర్లతో రచ్చ చేయడం, కులాల మధ్య చిచ్చు రేపడం, ప్రజల మధ్య రాజకీయ విద్వేషం రగల్చడం, విధ్వంసం సృష్టించడం వంటి స్వార్థ రాజకీయాలతో రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మార్పు- అభివృద్ధి కోసం జీవితాలను అంకితం చేసి, ప్రాణాలర్పించిన మహనీయులు పేరు, ప్రఖ్యాతల కోసం ఆ పని చేయలేదు. అందుకే వారు చరిత్ర పుటలకెక్కారు. తరాలు మారినా ఆదర్శప్రా యులుగా కీర్తిస్తున్నారన్నారు. కానీ కులం, మతం, ప్రాంతం, ఆచారాలు, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, వేషధారణ, అన్నింటినీ ఆయుధాలుగా మలచుకొని సమాజ విచ్ఛిత్తికి కొన్ని దుష్టశక్తులు ఎప్పుడు, ఎక్కడ, ఏ రూపంలో విరుచుకు పడతాయో ఊహించడమే దుర్లభంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దుష్టశక్తులు మహనీయులను సహితం కులం, మతం, ప్రాంతీయ కోణాల్లో చూడడం, అభిమానించడం, ద్వేషించడం వారి కుసంస్కారానికి ప్రబల నిదర్శనమన్నారు. మహనీయులు ఆవిష్కరించిన, ప్రవచించిన, ప్రతిపాదించిన భావజాలంపై మేధోమథనం, చర్చ జరిగితే సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది. ఆ ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేసి, చైతన్యవంతులను చేయడం అవసరమని తెలిపారు.

ప్రభుత్వ పథకాలకు, భవనాలకు, కాలనీలకు, ప్రాజెక్టులకు, ఆనకట్టలకు, జలాశయాలకు, వీధులకు, జిల్లాలకు, రేపోమాపో మండలాలకు వ్యక్తుల పేర్లు పెట్టడం, విగ్రహాలు నెలకొల్పడం లాంటి ధోరణి రోజు రోజుకు ప్రబలుతున్నదని అన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో మరింత తీవ్రస్థాయిలో వెర్రితలలు వేస్తోందని తెలిపారు. ఇది అత్యంత జుగుప్సాకరంగా పరిణమించిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 26 జిల్లాలలో 18 జిల్లాలకు జిల్లా కేంద్రం లేదా ప్రాంతం లేదా నదుల పేర్లు పెట్టారు. వాటి పట్ల ఎలాంటి వివాదం లేదు. 8 జిల్లాలకు వ్యక్తుల పేర్లు పెట్టారు. తాజాగా కోనసీమ జిల్లాకు బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారు. ఇక్కడితో ఆగిపోలేదని సీనియర్ మంత్రి బొత్సా సత్యనారాయణ వ్యాఖ్యానించారు. అంటే ఇంకా ఏఏ జిల్లాకు ఎవరి పేరు పెడతారో తెలియదు. కొన్ని సామాజిక తరగతుల ప్రజల నుంచి కొన్ని పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం వాటిని పరిగణలోకి తీసుకుంటుందో! లేదో! భవిష్యత్తులో తేలుతుంది. జిల్లాలకు రాజకీయ నాయకుల పేర్లు, ఆ మాట కొస్తే వ్యక్తుల పేర్లు పెట్టడంలో ఔచిత్యం ఏమైనా ఉన్నదా ? అని ఆయన ప్రశ్నించారు. అసలు వ్యక్తుల పేర్లు జిల్లాలకు పెట్టడం అసంబద్ధమని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

కోనసీమ విధ్వంసం..

ఆర్‌ఎస్‌ఎస్ ప్రథమ... ప్రభుత్వం రెండో ముద్దాయి

- ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు
- మంత్రి విశ్వరూప్‌ను పరామర్శించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన విధ్వంసానికి బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రథమ ముద్దాయి అని, ఇరవై ఆరు జిల్లాలను ప్రకటించినప్పుడే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టి ఇదంతా జరిగేది కాదని, అందుకే రెండో ముద్దాయి జగన్ ప్రభుత్వమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఘటన జరిగిన ప్రదేశాలను సీపీఐ కోనసీమ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబుతో కూడిన బృందం ఆందోళనకారులు కాల్చివేసిన మంత్రి పినిపే విశ్వరూప్ గృహాన్ని, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ గృహాన్ని బృందం సందర్శించింది. అనంతరం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఏబీవీపీ జీర్ణించుకోలేక లేకపోయాయన్నారు. ఘటన జరిగిన రోజే 500 మంది ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు పథకం ప్రకారమే అమలాపురం సమావేశమై అవకాశం కోసం పొంచి ఉన్నారన్నారు. ప్రశాంతమైన వాతావరణాన్ని ఆర్‌ఎస్‌ఎస్ కులాలు, మతాల పేరుతో సెంటిమెంట్ రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వం 26 జిల్లాలను ప్రకటించేటప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెడితే ఈ సమస్య వచ్చేది కాదని ఆయన పేర్కొన్నారు. 30 రోజులు గడువు ఇవ్వడంతో సెంటిమెంట్‌ను ఆసరాగా చేసుకుని ఆర్ఎస్ఎస్ డ్రామా ఆడిందన్నారు. వినతి పత్రాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉంటే శాంతియుతంగానే వెళ్లారని జగన్ ప్రభుత్వం పోలీసులను ఉసుకొల్పి తీవ్రమైన లాఠీఛార్జ్ చేయడం ద్వారా ఆందోళనకారుల రెచ్చిపోయారని అప్పటికే ముసుగులో దాగున్న ఆర్ఎస్ఎస్ శ్రేణులు ఒక్కసారే

అనాగరికంగా పౌరులపై, బస్సులపై, మంత్రి నివాసాలపై దాడి చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టాలని మొట్టమొదటి కోరింది సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అని అన్నారు. జరిగిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో ముమ్మిడివరం నియోజకవర్గ కార్యదర్శి ఎస్ వెంకటేష్, అమలాపురం మండల కార్యదర్శి కే.చంద్రరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు సత్తిరాజు, ఆర్టీసీ యూనియన్ నాయకులు కె.చిరంజీవి, బీసీ సమైక్య నాయకులు నక్క వెంకటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గంగాధరం తదితరులు ఉన్నారు.

కిక్ చంద్రబాబు..సేవ్ ఏపీ: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు బాధ్యతలేని ప్రతిపక్ష నేత అని, ఆయన ఎలాగూ ఏపీలో ఉండటం లేనందున, ఇక్కణ్నుంచి తరిమికొట్టాల్సి ఉందనీ, అందుకే కిక్ చంద్రబాబు..సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో వైసీపీ ముందుకెళ్తుందని ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎన్టీ రామారావును ఆయన 73వ ఏట చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారన్నారు. చంద్రబాబుకు లోకేశ్‌పై నమ్మకం లేదని, కనీసం ఎమ్మెల్యేగా గెలిపించుకోలేకపోయాడన్నారు. ఒక బాధ్యత లేని ప్రతిపక్ష నాయకుడు, ఉన్మాది ఉన్నాడంటే అది చంద్రబాబేనని విమర్శించారు. ఒంగోలులో జరుగుతున్నది మహానాడు కాదనీ, తన మామ స్థాపించిన పార్టీని, చంద్రబాబు వెన్నుపోటు పొడిచి, ఆయన మరణానికి కారకుడయ్యాడని, ఎన్‌టీ రామారావు ఎంతో ఉన్నతాశయంతో 1982లో పార్టీని స్థాపించారని, ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలోకి చంద్రబాబుతోపాటు చాలామంది వచ్చి, రాష్ట్రాన్ని పాలించాలని, ఇక్కడ ఉన్న సంపదనంతా కొల్లగొట్టాలన్న ఉద్దేశంతో ఉన్నారంటూ మండిపడ్డారు. మహానాడుకు మూడు లక్షల మంది వస్తారని చంద్రబాబు చెబుతున్నారనీ, కనీసం 30 వేల మంది కూడా రారని తెలిపారు. వారిని తరలించేందుకు ప్రైవేట్ వాహనాల కోసం ఒక అధికారి సహాయం తీసుకున్నారనీ, అయినాసరే మూడు వేలకు మించి రారని పేర్కొన్నారు. మహానాడుకు రాకుండా పోలీసులు ఎవరినీ అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు. సీఎం జగన్ పరిపాలనలో అన్ని వర్గాల వారు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి చెందుతోందనీ, సామాజిక న్యాయం జరుగుతోందని చెప్పారు. కేబినెట్ సభ్యులతోపాటు డిప్యూటీ సీఎంలు, ఎన్నిక కాబడిన పదవులు, నామినేటెడ్ పదవుల్లో అన్నింటా దాదాపు 70 నుంచి 75 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

పునరుత్పాదకశక్తి రంగంలో

నూతన పరిశోధనలు అవసరం

మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

విశాలాంధ్ర-విజయవాడ : పునరుత్పాదకశక్తి రంగంలో విస్తృత పరిశోధనలు అవసరమని మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. సూర్యరశ్మి ఆధారిత (సోలార్) విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరగాల్సి ఉందని, ఈ రంగంలో నూతన ఆవిష్కరణలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఆయన శుక్రవారం ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ రీసెర్చ్ ఫ్యాకల్టీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కింద అందుబాటులో ఉన్న ఎంఎన్ఆర్ ప్రాజెక్టులు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, నూతన పరిశోధనలు, వాటి అభివృద్ధి వంటి అంశాలపై డాక్టర్ అనిల్‌కుమార్ వివరించారు. మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా ఏటా రూ.1,000 కోట్ల నిధులను నూతన పరిశోధనలు, అభివృద్ధికి కేటాయిస్తున్నామన్నారు. పరిశోధనల పరంగా ముందుకు సాగే ప్రభుత్వ రంగ సంస్థలకు 100 శాతం, ప్రయివేటు రంగ సంస్థలకు 50 శాతం ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తిలో జర్మనీ 50 శాతం వృద్ధిని సాధించిందని, మనదేశంలో దీనిని 20 నుంచి 30 శాతానికి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సోలార్ బేస్డ్ కోల్డు స్టోరేజీలను ప్రోత్సహించడం మంచిదన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు తమ వర్సిటీ పరిశోధనల ప్రగతిని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ప్రొఫెసర్ల బోధన, పరిశోధనలు ఇక్కడ అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ సోలార్ ఎనర్జీ ఏర్పాటుకు సహకారం అందించాలని ఆచార్య నారాయణరావు కోరారు. అనంతరం డాక్టర్ సుజిత్ కల్లూరి, డాక్టర్ తారకేశ్వర్, డాక్టర్ సర్ఫురాజ్, డాక్టర్ లక్ష్మీనారాయణ పాత్రోలు బ్యాటరీల తయారీలో ఇమ్మెర్షన్ కూలింగ్ టెక్నాలజీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో డాక్టర్ లక్ష్మీశిరీషా, డాక్టర్ నిమై మిత్రా, డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ రాజకీయ డ్రామాలు: శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ రాజకీయ డ్రామాలాడుతున్నారని, దళిత, బలహీన వర్గాలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే పట్టించుకునే వారే కరవయ్యారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఇప్పటికైనా రాజకీయ డ్రామాలకు జగన్ తెరదించాలని హితవు పలికారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం పేరుతో బస్సు యాత్ర చేస్తున్న మంత్రుల బృందం, ముందస్తుగా కోనసీమలో పర్యటించాలని సూచించారు. హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అరాచక శక్తుల దుర్మార్గాలకు అడ్డుకట్ట వేయాలని, బీఆర్ అంబేద్కర్‌కు అవమానం జరుగుతున్నప్పటికీ, రాజకీయం కోసం చోద్యం చూడడం శోచనీయమని విమర్శించారు. కోనసీమ జిల్లాకు పేరు పెట్టడంతోనే సరిపెట్టకుండా, జగన్ దావోస్ పర్యటన తరహాగా, కోనసీమకు వెళ్లాలని, అప్పుడు అక్కడ వాస్తవ పరిస్థితులు తెలుస్తాయన్నారు. హక్కులను ప్రజలు ఇంకా అడుక్కోవాలా అని ధ్వజమెత్తారు. జిల్లాల పేర్లు ప్రకటించిన సమయంలోనే అన్నిటితో పాటు ప్రకటించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. దళితులు బిక్కు బిక్కు మంటూ జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక వేత్తలకు రూ.2 కోట్ల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇచ్చిందని గుర్తుచేశారు.

రోహిణి-200 సౌండింగ్ రాకెట్ విజయవంతం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో శుక్రవారం రోహిణి 200 సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. అనేక మంది విద్యార్థులు, యువ సైంటిస్ట్‌లు ఈ ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో డైరెక్టర్ రాజరాజన్ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులకు ఇస్రో పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో విజేతలకు ఇస్రో చైర్మన్ చేతుల మీదగా శనివారం బహుమతులను అందించనున్నారు. ఇస్రో అధికారి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ విశ్వభూషణ్‌తో తమిళిసై భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులను శుక్రవారం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. భువనేశ్వర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమంలో గురువారం పాల్గొన్న గవర్నర్ అక్కడి నుంచి తిరిగి విజయవాడ చేరుకునే క్రమంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో అనుసంధాన విమానం కోసం వేచి ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ కలిశారు. రెండు రాష్ట్రాల గవర్నర్లు పలు అంశాలపై చర్చించారు. గవర్నర్ హరిచందన్ దంపతులను తెలంగాణ గవర్నర్ తమిళిసై శాలువతో సన్మానించారు. మూడు రోజుల ఒడిశా పర్యటన అనంతరం గవర్నర్ దంపతులు శుక్రవారం సాయంత్రం విజయవాడ రాజ్‌భవన్‌కు చేరుకున్నారు.

రహదారులు రక్తసిక్తం

- ఒకేరోజు మూడు రోడ్డు ప్రమాదాలు
- ఆరుగురి మృతి, 8మందికి గాయాలు
- ఆగిఉన్న వాహనాలతోనే ప్రమాదాలు

విశాలాంధ్ర-పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున రహదారులు రక్తసిక్తమయ్యాయి. మూడు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా, మరో ఎనిమిదిమంది గాయపడ్డారు. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజకవర్గంలోని, నక్కపల్లి మండలం, గొడిచెర్ల జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి టాటా మ్యాజిక్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, గన్నవరం గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వరమ్మ(45), డ్రైవర్ మరడ రమేష్ (40) మృతి చెందారు. తలారి సింహాచలం, బొడ్డపు నాగరాజు, మరడ అప్పలనర్స, ఎం.నవీన్, ఎం.మంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాలతోపాటు గాయాలపాలైన వారందరిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా సింహాచలం దర్శనానికి వెళ్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు వచ్చిన హైవే పెట్రోల్ వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో వాహనం మరమ్మతులకు గురైంది. అలాగే నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగి ఉన్న లారీని మోటార్‌బైక్ ఢీకొని యానాంకు చెందిన జాన ఆనంద్ జయ శేఖర్‌రెడ్డి (20) మృతి చెందాడు. పిఠాపురానికి చెందిన బొడ్డా రాజశేఖర్ గాయాలపాలయ్యాడు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సుబ్బారాయుడు పాలెం వద్ద కారు చెట్టును బలంగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఇద్దరు గాయాలపాలయ్యారు. తుని నుంచి మాకవారపాలెం వెళుతుండగా ప్రమాదం జరిగింది. మాకవరపాలెం మండలం, తామరం గ్రామానికి చెందిన రాచూరి దుర్గాప్రసాద్, ఎల్లపు నాగేంద్ర, రోహిత్ మృతి చెందారు. గెడ్డం లక్ష్మణ్, మైరిచర్ల గౌరీనాథ్ గాయాలపాలయ్యారు.

జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు రోడ్డు పక్కన నిలిపిన వాహనాలే కారణాలుగా నిలుస్తున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాలతోపాటు శుక్రవారం తెల్లవారుజామున నక్కపల్లి మండలంలో జరిగిన రెండు ప్రమాదాలు ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడం వల్ల జరిగినవే. జాతీయ రహదారిపై వాహనాలు నిలపకూడదని పోలీసులు ఎన్నిసార్లు చెబుతున్నా డ్రైవర్లు పట్టించుకోవడం లేదు.

LAKSHMI PRAKASH AGRO SOLUTIONS PVT LTD

వారి తరపున రైతులకు మరియు వ్యవసాయ శాఖ వారికి దిగువ తెలిపిన 100% నీటిలో కరిగే మిశ్రమ న.భా.పా. ఎరువులు New India Crop Science, Gujarat కంపెనీచే తయారు చేయబడినవి, మరియు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ గెజిట్ ఆర్డర్ నెం. 2900 (E) తేది 24 అక్టోబర్ 2015 నిబంధనలకు లోబడి త్వరలో అమ్మకము చేయదలచుకున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం.

19-19-19
20-20-20
13-40-13

మరిన్ని వివరముల కొరకు

LAKSHMI PRAKASH AGRO SOLUTIONS PVT LTD
D.No.25-4/12, Sri Lakshmi Ganapathi Nivas, Ground & First Floor, RR Nagar, Vijayawada, Andhra Pradesh - 520012.
E-mail : lakshmiprakashaspl@gmail.com

సంపాదకీయం

ఎనిమిదేళ్లుగా విద్వేషమే ఎజెండా

బ్రెజిల్‌తో సహా అనేక దేశాల్లో విద్వేష రాజకీయాలు మత మైనారిటీలను పీడిస్తున్న దుర్మార్గ ప్రభుత్వాలను గమనిస్తున్నాం. గత ఎనిమిదేళ్ల మోదీ పాలన చూసిన తరవాత 1996లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఎంత మెరుగైందో నని సంతృప్తి పడక తప్పని స్థితికి చేరుకున్నాం. ఆ రోజుల్లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాలు నడిపిందే తప్ప పూర్తి మెజారిటీ లేనందువల్ల వివాదాస్పదమైన అంశాలను పక్కన పెట్టాల్సి వచ్చింది. 2019లో మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత ఇతర చిన్నా చితక రాజకీయ పార్టీల అవసరం లేకుండా పోయింది. అందుకే విభజన, విద్వేష రాజకీయాలు పురి విప్పి వికృతంగా నర్తిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలను రాజకీయ రంగం నుంచి తొలగించడానికి ప్రయత్నిస్తు న్నాయి. జనాన్ని విభజించి పాలించే రాజకీయాలు మనకు బ్రిటిష్ వలస పాలకులు పెట్టిన భిక్ష. స్వాతంత్ర్యం తరవాత కూడా అనేక రాజకీయ పక్షాలు ప్రజలను మతాల వారీగా విభజించి రాజ్యమేలే విధానాలలో ఆరితేరి పోయాయి. విద్వేష రాజకీయాలు ఇప్పుడు మాటలకు పరిమితమైనవి కాదు. నేరాలుగా పరిగణించి కళ్లు మూసుకోవడానికి అనుమతించేవి కావు. ఇవి మారణ హోమ స్థాయికి చేరాయి. మారణ హోమం అంటే ప్రతిసారి వందలు, వేల సంఖ్యలో హత్యాకాండ జరగాల్సిన పనేం లేదు. ఈ మారణ హోమం జనాల మెదళ్లు తొలిచేసి విద్వేషం నింపే ప్రక్రియ. ఈ విద్వేషం మత దురహంకార స్థాయి దాటి చాలాకాలం అయింది. మృత్యు బేహారులు ఇవ్వాళ అధికారంలో ఉన్నారు. విద్వేష కారణంగా జరుగుతున్న ఘటనలను సాధారణమైన నేరాల కింద జమకట్టేసి మెజారిటీ మతంవారి మెదళ్లను తొలిచేసే కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మతవిద్వేషాలను పొరపాటుగా అంచనా వేసే అలవాటు మన దేశంలో మొదటి నుంచీ ఉంది. 2002లో జరిగిన గుజరాత్ మారణకాండను, అంతకు ముందు 1983లో నెల్లీ మారణ కాండను, 1984లో ఇందిరా గాంధీ హత్యకు ప్రతీకారంగా ఢిల్లీ తదితర ప్రాంతాలలో జరిగిన సిక్కుల ఊచకోతను మతకలహాలుగా ముద్ర వేసి చాప కిందకు తోసేసి అధికార పీఠాలెక్కడం అలవాటు అయిపోయింది. నిజానికి ఇవేవీ మత కలహాలు కావు. రెండు మతాల వారు కలహించుకుంటే అది మతకలహం. ఒక మతం వారిని మరో మతం వారు మూకుమ్మడిగా హతమారిస్తే అది ఒక మతం వారిపై జరిగిన మారణహోమమే తప్ప మతకలహాలు కావు. ప్రమాదకరమైన స్థాయిలో మైనారిటీల మీద కసి తీర్చుకోవడం బాహాటంగా కొనసాగుతోంది. ఇది ప్రభుత్వ మద్దతుతో కొనసాగుతున్న లేదా ఎంత ఉదారంగా ఆలోచించినా ప్రభుత్వ ఉదాసీనతవల్లో లేదా తాము ప్రాతినిధ్యం వహించే మతం మీద ఉండే అభిమానం కారణంగానో ఉపేక్షిం చడంవల్ల జరుగుతున్న వికృత క్రీడ. 2014 మేలో నరేంద్ర మోదీ ప్రధానిగా బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2019 ఏప్రిల్ 30 మధ్య కాలంలో ఉద్దేశ పూర్వకంగా మత వివక్షవల్ల 23 రాష్ట్రాలలో జరిగిన సంఘటనల్లో 99 మంది మరణించారు. 703 మంది గాయపడ్డారు. ఆ తరవాత మూడేళ్ల కాలం నాటి లెక్కలను కూడా ఒక చోట చేరిస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ఇది కేవలం సంఖ్యకు సంబంధించిన వ్యవహారం కాదు. విద్వేష రాజకీయాలు కలిసికట్టుగా ఉండవలసిన ప్రజలను ఎలా విడదీస్తున్నాయో ఆలోచించవలసిన తరుణం ఇది. నిజానికి విద్వేష రాజకీయాలవల్ల కలిగిన జననష్టాన్ని విడిగా నమోదు చేసే పద్ధతి మనకు అందు బాటులో లేదు. అందుకే మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వాన్ని సమాచారం లభించని ప్రభుత్వం అని ఎద్దేవా చేస్తున్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం విద్వేష రాజకీయాలు అధికారం సంపాదించడంతో ఆగి పోవడం లేదు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సంఘ్ పరివార్‌కు అధికారం సంపాదించడానికి నిచ్చెన మెట్లే తప్ప ఈ రెండింటి మీద పరివార్‌కు ఎన్నడూ విశ్వాసం లేదు. మనుధర్మ శాస్త్రమే మనకు రాజ్యాంగం అన్న భావన సంఘ్ పరివార్ ఇప్పటికీ నమ్ముతోంది. మోదీ విభజన రాజ కీయాలను బేరీజు వేయడం అంటే మూక దాడులు, మత వైషమ్యాలవల్ల పోయిన ప్రాణాలు, ఊనా లాంటి సంఘటనో మైనారిటీ అమ్మాయిల మీద జరుగుతున్న అత్యాచారాలకు పరిమితమైన సంఘటనల తారీకుల వారీ తఖ్సీళ్లు మాత్రమే కాదు. స్వాతంత్ర్యోద్యమ క్రమంలో రూపు దిద్దుకున్న జాతీయవాదం అంటే సంఘ్ పరివార్‌కు మొదటి నుంచి ఒంటి మీద తేళ్లు జెర్రులు పాకినట్టు ఉంటుంది. మెజారిటీ మతస్థులైన హిందువుల ఆధిపత్యమే సంఘ్ పరివార్ దృష్టిలో అసలు సిసలైన జాతీయతావాదం. బహుళత్వాన్ని పాతరేసి హిందుత్వ ఏకరూపత సాధించడమే పరివార్ దృష్టిలో జాతీయతావాదం. హిందు త్వంపై ఆధారపడ్డ జాతీయతా వాదం కచ్చితంగా నియంతృత్వానికే బాటలు వేస్తుంది. అంటే మోదీ బాణిలో కొనసాగుతున్న విభజన లేక విద్వేష రాజకీయాల లక్ష్యం కేవలం అధికారం సంపాదించడంతో సంతృప్తి పడదు.

ఇలాంటి భావజాలం ఉన్న శక్తులకు మతతత్వమే పునాది కనక వారి ఏలుబడిలో సాగే నియంతృత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుంది. దీనిని కొనసాగిస్తున్నది మోదీ కావచ్చు. నిజానికి దీనికి బీజాలు అద్వాణీ బీజేపీ నాయకుడిగా ఉన్నప్పుడే పడ్డాయి. సెక్యులర్ వాదులను సిక్యులర్ వాదులు అని ప్రచారం చేసింది ఆ మహానుభావుడే. గుజరాత్‌లో మోదీ కనుసన్నల్లో జరిగిన మారణకాండ విభజన రాజకీయాలు పురివిప్పి బీభత్స రస ప్రధానమైన నర్తనానికి తొలి అడుగు మాత్రమే. అడపాదడపా ముస్లింలు బీజేపీకి ఓటు వేసిన సందర్భాలు లేకపోలేదు. కానీ 20 శాతం ఉన్న మైనారిటీల ఓట్లు సంపాదించడానికి పాటు పడడం కన్నా హిందువులను సంఘటితం చేసి తమ వేపు తిప్పుకోవడం ఉత్తమ మార్గమని సంఘ్ పరివార్‌కు అవగతమైంది. అందుకే ముస్లిం అభ్యర్థులకు బీజేపీ టికెట్లు ఇవ్వడమే మానేశారు. హిందువులను తమకు అనుకూలంగా మలుచు కోవడానికి ఒక వేపు ముస్లిం బూచి చూపించడం, మొగల్ పాలనలో జరిగాయని ప్రచారం చేస్తున్న అఘాయిత్యాలకు ఇప్పుడున్న ముస్లింలను బాధ్యుల్ని చేయడం కోసం ముస్లింలపై ద్వేషం పెంచడం ఒక మార్గంగా, మరో వేపు ముస్లింల నుంచి హిందువులకు ప్రమాదం పొంచి ఉందని బలంగా ప్రచారం చేసి లేని అభద్రతా భావాన్ని కల్పించి హిందువులను సంఘటితం చేసే లక్ష్యాన్ని బీజేపీ సునాయాసంగా నెరవేర్చుకోగలిగింది. బీజేపీ విద్వేష పాలనకు అడ్డుకట్ట వేయడమే ప్రజల కర్తవ్యం.

ఆమె లేని లోకం

నా దుఃఖానికి 365 రోజులు నిండాయి. ఇది నా వ్యక్తిగత కన్నీరు. సామూహిక వేదన. మేమిద్దరం ఎప్పుడూ ఒకే కలను కనేవాళ్లం. కొన్నాళ్లకు ఆ మా కల నిజమై ముగ్గురు కంటున్న కలగా రూపాంతరం చెందింది. 16 సంవత్సరాల పాటు మాతోనే ఉన్న ఆ అద్భుత ఆనందం కళ్ల ముందే ఆవిరై పోయింది. మా కుటుంబంలోకి హఠాత్తుగా ప్రవేశించిన క్యాన్సర్ పురుగు ఆ మా కలను విధ్వంసం చేసింది. ఇప్పుడు కనడానికి కలే కాదు... ఆమె కూడా కనుమరుగైంది.

ఆమె ఈ భూమి మీద పాదం మోపేందుకు తొమ్మిది నెలల సమయం పడితే మృత్యువు వొడిలోకి వెళ్లేందుకు పట్టిన కాలం కేవలం నాలుగు నెలలు. "చావు అందరికీ సమానమే అయినా చావు అందరినీ సమానంగా ప్రేమించదు... సమా శ్వాసించదు" నేలంతా అలికి... ముగ్గులు పెట్టి... పచ్చని కొబ్బరాకుల పందిరి కింద సేద తీరుతున్నట్లుగా ప్రపంచానికి కనిపించిన మా జీవితం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ సువిశాల ప్రపంచంలో మేమిద్దరం దిక్కులేని వాళ్లలా మిగిలిపోయాం. ఈశ్వరి ఎప్పుడూ ప్రాణం పోసుకుని కళ్ల ముందు కదలాడుతున్న ఆనందంలా ఉండేది. ఓ జర్నలిస్టును వివాహమాడిన ఆమెను నిరంతరం ఎన్నో బాధలు వెంటాడేవి. కాని అవేవీ మా జీవితంలోకి తొంగి చూడకుండా కుటుంబాన్ని కాపాడే సెంట్రీలా ఉండేది. నిజానికి జర్నలిస్టులు ముఖ్యంగా తెలుగు జర్నలిస్టుల జీవితాలన్నీ ఇంచుమించు ఇలాంటివే. లోకాన్ని ఉద్ధరించే పనిలో ఉన్నామనే భ్రమలో ఉన్న జర్నలిస్టులకు ఆ భ్రమ కలకాలం నిలిచి ఉండేలా జాగ్రత్తలు తీసు కునేది వారి సహచరులే. ఈ చిన్న విషయం నాకు ఆమె మరణం తర్వాతే బోధ పడింది.

భార్య అనే పదానికి సరైన నిర్వచనం ఆమె. రోడ్డు మీద హఠాత్తుగా మటుమాయం కావడం మృత్యువు అంటాడు అజంతా. అలా నాలుగు నెలల కాలంలో హఠాత్తుగా మటుమాయం అయిన ఇల్లాలు ఆమె. స్త్రీలు పసుపు కుంకుమలతో వెళ్లిపోవాలని ఆశపడతారు. ఓ సాధారణ మధ్యతరగతి ఇల్లా

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

లిలా తాను అలాగే కలగంది. ఆ కలను నిజం చేసుకుంది. కాని, తానే జీవితం అనుకున్న వారు ఆ కోరిక వెనుక ఎంతటి వేదన అనుభవిస్తారో ఈ స్త్రీలోకానికి తెలియదు. నే చేసే ప్రతిపనిలోనూ ఆమె పాత్ర విస్పష్టంగా ఉండేది. ముఖ్యంగా నేను రాసిన కేరాఫ్ కూచిమంచి అగ్రహారం కథలకు తెలుగు రాష్ట్రాలలో ఇంతటి ప్రాచుర్యం వచ్చిందంటే ఆ కథల సక్సెస్ ఆ నా ఈశ్వరిదే. నా కథలలో అనేకానేక మందికి అత్యంత ఇష్టమైన కథగా, పేరు వచ్చిన బోగం వీధి సుగుణ కథ రాసే సమయంలో నా ఈశ్వరి నా పక్కనే లేకపోతే ఆ కథ అంత బాగా వచ్చేది కాదేమో... లోకంలో ప్రతి శ్రీమతి ఇలాగే ఉంటారు. నేను ఇంగ్లీషు సాహిత్యాన్ని ఏ మాత్రమైనా చదువుకున్నానంటే అందుకు కారణం ఈశ్వరే. ఆమె ఎంఎ ఇంగ్లీష్‌లో పట్టభద్రురాలు. ఇంగ్లీషు సాహిత్యాన్ని విపరీతంగా చదివిన ఈశ్వరి ఎప్పుడూ ఓ మాట అనేది. తెలుగులో ఇంత మంచి సాహిత్యం రావాలంటే వెయ్యి మంది విశ్వనాథలు, లక్షమంది శ్రీశ్రీలు, కోటి మంది చలాలు పుట్టాలని. అలా అంటునే మళ్లీ ఓ మాట అనేది. ఒక్క శ్రీశ్రీని, ఏకైక చలాన్ని, ఒక్కగానొక్క విశ్వనాథలకే ఈ తెలుగు సాహిత్యం ఇంత ముక్కలైంది. అంతమంది ఉంటే ఇక ఏమైపోతుందో అని. నా మిత్ర కవులు వసీరా, సౌదా, సీతారాంలకు ఆమె చాలా ముఖ్యమైన స్నేహితురాలు. వాళ్లని కలిసినప్పుడు సాహిత్యం గురించి అనేక చర్చలు జరిగేవి. చిన్న సంఘటన. మా పెళ్లయి వారం అయ్యింది. యాకూబ్ కవిత్వం మీద తెలుగు విశ్వవిద్యాలయంలో ఓ సదస్సు పెట్టాడు. ఆ సదస్సును సౌదా, అరుణ, నాతో పాటు అనేక మంది కవులు, రచయితలు తీవ్రంగా వ్యతిరేకించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు జరుగుతూంటే క్యాంపస్ బయట మా నిరసన ధర్నా. ఈశ్వరిని కూడా రమ్మని అడిగాను. నువ్వు వెళ్లు నేను తర్వాత వస్తాను అని నన్ను ముందే పంపేసింది. తనకి ఈ సాహిత్యం, కవులు, ధర్నాలు వంటివి తెలియవులే అని సరిపెట్టుకున్నాను. నేను బయలుదేరుతున్నప్పుడు మాత్రం అక్కడ ఎంతమంది ఉంటారు అని అడిగింది. ఓ పాతిక మంది అని సమాధానం చెప్పి వెళ్లిపోయా. సరిగ్గా 12 గంటలకు ఓ ఆటోలో నాలుగు బకెట్ల నిండా పులిహోరా, రెండు క్యాన్లలో పెరుగు, ప్లాస్టిక్ పళ్లాలు పెట్టుకుని క్యాంపస్ దగ్గర దిగింది. ధర్నాలో ఉన్న వారందరికీ తానే కొసరి కొసరి వడ్డించింది. ఈ సంఘటన ఆనాడు అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి, ఆనందానికి గురి చేసింది. ఇంటికి వచ్చాక అడిగాను రానన్నావు కదా అని. నిరసనలో అందరూ పాల్గొంటే ఎలా. వారి ఆవేశాన్నే కాదు. ఆకలిని చూడాలి కదా అంది.

కె.ఎన్.వై.పతంజలి సాహిత్యంపై కవి సీతారాం ఓ వ్యాసం రాసి ఆ వ్యాసాన్ని నాకు అంకితం ఇచ్చాడు. అలా ఎవరైనా మనకి అంకితం ఇస్తే వారి ని సత్కరించాలి. ఆ సంప్రదాయం ఇంగ్లీషు సాహిత్యంలో ఉంది. తెలుగులో లేదు అంది ఈశ్వరి. నేను విని ఊరుకున్నా. ఇది జరిగిన చాలా కాలానికి సీతారాం దంపతులు రాజమండ్రి వచ్చారు. ఆ సమయంలో రాజమండ్రిలో నేను జర్నలిస్టుగా పని చేస్తున్నాను. వారిద్దరిని ఇంటికి భోజనానికి పిలిచాను. వాళ్లు వచ్చారు. మంచి వంటలతో వారికి భోజనం వడ్డించింది ఈశ్వరి. అనంతరం నన్ను లోపలికి పిలిచి బీరువాలో తాను ముందు రోజు కొన్న కొత్త బట్టలు చూపించింది. నేను ఆశ్చర్యపోయా. ఇదేమిటి అని అడిగితే... ఆనాడు నీకు అంకితమిచ్చిన వ్యాసానికి ఈనాడు మనం చేసే చిన్న సన్మానం అంది ఈశ్వరి. ఈ చర్యకు నేనే కాదు... సీతారాం దంపతులు ఆశ్చర్యపోయారు. ఆనందపడిపోయారు. ఈశ్వరి ఏం చేసినా అలాగే ఉండేది... ఏం చేయక పోయినా అలాగే ఉండేది.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్, 9912019929

క్వాడ్ భారత ప్రయోజనాలకు హానికరం

వినయ్ విశ్వం

భారతదేశ ప్రయోజనాలకు క్వాడ్ ఎంతమాత్రం మేలు చేసేది కాదు. క్వాడ్ శిఖరాగ్ర సమావేశం చర్చలను విశ్లేషించేందుకు అనేక మంది వ్యూహకర్తలు తలమునకలై ఉన్నారు. మే 24వ తేదీన టోక్యోలో ఈ సమావేశం జరిగింది. 'ప్రజాస్వామ్య ప్రపంచం' లో జరుగుతున్న గొప్ప అభివృద్ధిని తెలియజేసేందుకు ఈ సమావేశం మైలురాయి వంటిదని ప్రచారం చేసేందుకు అనేక మంది పూనుకున్నారు. ఉమ్మడి అభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, బాధ్యతాయుత భాగస్వామ్యం, స్వేచ్ఛా ప్రపంచ విలువలు మొదలైన పదజాలాన్ని వాడుతూ టోక్యో సమావేశం చాలా గొప్ప స్ఫూర్తినిస్తుందని చెప్పేందుకు తంటాలు పడుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారతదేశ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం చర్చల స్ఫూర్తి అంతాఇంతా కాదంటూ పొగిడేందుకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, భారత ప్రధాని నరేంద్రమోదీ పోటీపడ్డారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా తాము ఉన్న స్థానాలను సైతం మరిచిపోయి పరస్పర సంబంధాలను గూర్చి అనేక అతిశయోక్తులను ప్రవచించారు. ప్రపంచంలో భౌగోళికంగా అత్యంత ప్రాధాన్యత గల ప్రాంతంలో అనుసరించవలసిన అజెండాను ముందుకు తీసుకువెళ్లేందుకు అమెరికా విధాన రూపకర్తలకు, రక్షణ వ్యూహకర్తలకు ఇది ఒక గొప్ప అవకాశాన్ని కల్పించింది.

క్వాడ్ స్ఫూర్తితో ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని ఇండో-పసిఫిక్ ప్రాంతంగా తిరిగి నామకరణం చేశారు. ఇందుకు కారణాలు అందరికీ తెలిసిందే. టోక్యో సమావేశం నేపథ్యంలో కొత్తగా ఇండో-పసిఫిక్ ఆర్థిక చట్రం (ఐపిఇఎఫ్) రూపొందించారు. ఇందులో 13 దేశాలు భాగస్వాములుగా ఉంటాయి. ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత ఎవరూ విస్మరించదగింది కాదు. భౌగోళికంగా మొత్తం భూమిలో 25 శాతం ఇండో-పసిఫిక్ ఏరియా ఉంటుంది. ప్రపంచంలో ఉండే సముద్రాలలో 65 శాతం ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలోనే ఉన్నారు. అలాగే ప్రపంచ యువతలో 68 శాతం ఇక్కడే ఉన్నారు. ప్రపంచ జీడీపీలో 60 శాతం ఈ ప్రాంతానిదే. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో మూడింట రెండు వంతులు ఈ ప్రాంతంలోనే ఉంటుంది. ఆధునిక ప్రపంచంలో ఈ ప్రాంతానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్రాంత దేశాలు పరస్పర సహకారంతో తమతమ ఆదాయాలను పెంచుకోవటం సహజమే. మానవాళి ఎదుర్కొంటున్న సవాళ్ల పైన శ్రద్ధ వహించినట్లయితే సంయుక్త ప్రాజెక్టులను మనం ఆహ్వానించవలసిందే. ప్రస్తుతం వాతావరణ మార్పులు, భూమండలం వేడెక్కటం లాంటి సమస్యలు ప్రపంచానికి ముప్పుగా ఏర్పడ్డాయి.

2015లో జరిగిన పారిస్ వాతావరణ సదస్సులో చేసిన తీర్మానాలను అమలు జరిపేందుకు అన్ని దేశాలు ప్రతిజ్ఞ చేసినప్పటికీ హాని కలిగించే వాతావరణ మార్పులు మరింత తీవ్రతరమయ్యాయే కాని తగ్గలేదు. దక్షిణాసియా ప్రాంతంలో మంచు దిబ్బలు వేగంగా కరిగిపోతున్నాయి. సముద్ర నీటిమట్టాలు రోజురోజుకు పెరుగుతూ ద్వీపకల్ప దేశాలను భయపెడుతున్నాయి. కోవిడ్ 19 మహమ్మారి ముప్పు ఇంకా ప్రపంచ ప్రజలను వెంటాడుతూనే ఉంది. ఈ ప్రాంతంలో నిరుద్యోగం, పేదరికం కోట్లాది ప్రజలను విడవకుండా వారి సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో పేదరికం పెరుగుతూనే ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న వనరులను విధిగా ఖర్చుచేయాలి. క్వాడ్, ఐపిఇఎఫ్‌ల ముందు ఉన్న ప్రాథమిక విషయం వారు నిర్ణయించుకున్న లక్ష్యాలలో ప్రాధాన్యతా క్రమాన్ని అర్థం చేసుకోవడం, వారి సంసిద్ధతను పరిశీలించటం అవసరం. ఈ సమావేశం రూపొందించిన పత్రాల సమాచారం మేరకు చర్చలు, తీర్మానాలు ప్రస్తుతం ఎదురవుతున్న తీవ్ర సవాళ్ల పైన నామ మాత్రపు స్పందనలే ఉన్నాయి. క్వాడ్ నాయకులంతా తమ రాజకీయ, ఆర్థిక లక్ష్యాల పైనే శ్రద్ధ పెట్టారు. అమెరికా భౌగోళిక, రాజకీయ లక్ష్యాలను సాధించేందుకు క్వాడ్ ఒక కీలకమైన వేదికగా ఉపయోగించుకుంటుందని అర్థం అవుతోంది.

ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ తలెత్తినప్పటికీ తన సామ్రాజ్యవాద రాజకీయ వ్యూహాలను అమలు జరిపేందుకు అక్కడ అమెరికా జోక్యం చేసుకొంటోంది. ప్రతి సంఘర్షణను తన ఆయుధాలు అమ్ముకొనేందుకు ఒక గొప్ప అవకాశంగా అమెరికా భావిస్తోంది. పరిష్కారానికి చర్చలను అది నిరుత్సాహపరుస్తుంది. ఐక్యరాజ్య సమితి తదితర సంస్థలను తీవ్రంగా బలహీనపరిచింది. ప్రాంతీయ సంఘర్షణల విషయంలో టోక్యో సమావేశం అమెరికా దృష్టి కోణం నుంచే చూస్తోంది. ఇందులో భాగస్వామ్యం కలిగిన భారతదేశం కొంచెం భిన్నమైన వైఖరిని తీసుకొంది. ఇందులో పాల్గొన్న అన్ని దేశాలు చైనాపై ఐక్యంగా ఉన్నప్పటికీ రష్యా పైన భిన్నమైన వైఖరిని కలిగి ఉన్నాయి. అమెరికాకు చెందిన సైనిక, పారిశ్రామిక వ్యవస్థ పెంటగాన్ ప్రతి విదేశాంగ విధానంలోను కీలక పాత్ర వహిస్తుంది. ఐరోపాలో నాటోను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆసియాలో గతంలో ఏర్పాటు చేసిన ఆగ్నేయాసియా ఒప్పంద సంస్థ అత్యంత క్రియారహితమైంది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకే క్వాడ్ అమెరికాకు ఉపయోగపడుతుంది. అలాగే క్వాడ్ కూటమి రక్షణ ఒప్పందాలు, సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించనున్నది.

"మనం ఒక నిర్ణయాత్మక దశాబ్దిలో ఉన్నాం, ఇది గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతం చరిత్రలో అడ్డంకిగా నిలిచింది. ఈ నేపథ్యంలో అమెరికా పాత్ర మరింత సమర్థంగా పనిచేస్తూ, గతంలో ఏనాటి కంటే నేడు సహనం కలిగి ఉండాలి." అని అమెరికా అధ్యక్షుడి కార్యనిర్వాహక కార్యాలయం జాతీయ భద్రతా మండలి రూపొందించిన పత్రంలో ఉన్నది. భారతదేశం ముందు అత్యంత కీలకమైన ప్రశ్న ఉన్నది. మనం నిజంగా ఆత్మ నిర్భర్ భారత్‌ను తయారు చేసుకుంటున్నామా? అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసం రూపొందించుకున్న పథకంలో భాగస్వామ్యం కలిగి ఉండేందుకు ఆ దేశానికి అణగిమణిగి ఉండాలా! అలా ఉన్నట్లయితే 21వ శతాబ్దిలో ప్రపంచ నాయకుడిగా ఎదగాలన్న భారతదేశ లక్ష్యానికి ఈ వైఖరి ప్రయోజనం కల్పిస్తుందా? వైట్‌హౌస్ రూపొందించిన ఇండో-పసిఫిక్ కార్యాచరణ ప్రణాళిక ముసాయిదా అత్యంత తీవ్ర అభ్యంతరకరమైంది. దీని అర్థం సైనిక శక్తిని బలోపేతం చేయడమే. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణించబోదు. అమెరికాకు ఇది అవసరం కావచ్చు. భారతదేశం లాంటి దేశాలకు ఇది ముఖ్యం కాదు. క్వాడ్, ఐపిఇఎఫ్‌లు ఈ ప్రాంతంలో యుద్ధాన్ని కోరుకుంటున్నాయా? లేక శాంతి కావాలనుకుంటున్నాయా? అనేది ముఖ్యం. ప్రస్తుతం వాతావరణ మార్పులు, కోవిడ్ మహమ్మారి, పేదరికం, నిరుద్యోగం అత్యంత ముఖ్యమైన సమస్యలు. అందువల్ల భారతదేశం యుద్ధం, సంఘర్షణల జోలికి వెళ్లకుండా శాంతి, పురోగతిని మాత్రమే కోరుకోవాలి.

వ్యాస రచయిత సీపీఐ కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకుడు

> భారతదేశం ముందు అత్యంత కీలకమైన ప్రశ్న ఉన్నది. మనం నిజంగా ఆత్మ నిర్భర్ భారత్‌ను తయారు చేసుకుంటున్నామా? అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసం రూపొందించుకున్న పథకంలో భాగస్వామ్యం కలిగి ఉండేందుకు ఆ దేశానికి అణగిమణిగి ఉండాలా! అలా ఉన్నట్లయితే 21వ శతాబ్దిలో ప్రపంచ నాయకుడిగా ఎదగాలన్న భారత దేశ లక్ష్యానికి ఈ వైఖరి ప్రయోజనం కల్పిస్తుందా? వైట్ హౌస్ రూపొందించిన ఇండో-పసిఫిక్ కార్యాచరణ ప్రణాళిక ముసాయిదా అత్యంత తీవ్ర అభ్యంతరకరమైంది. దీని అర్థం సైనిక శక్తిని బలోపేతం చేయడమే. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణించబోదు. అమెరికాకు ఇది అవసరం కావచ్చు. భారతదేశం లాంటి దేశాలకు ఇది ముఖ్యం కాదు. క్వాడ్, ఐపిఇఎఫ్‌లు ఈ ప్రాంతంలో యుద్ధాన్ని కోరుకుంటున్నాయా? లేక శాంతి కావాలనుకుంటున్నాయా? అనేది ముఖ్యం. ప్రస్తుతం వాతావరణ మార్పులు, కోవిడ్ మహమ్మారి, పేదరికం, నిరుద్యోగం అత్యంత ముఖ్యమైన సమస్యలు. అందువల్ల భారతదేశం యుద్ధం, సంఘర్షణల జోలికి వెళ్లకుండా శాంతి, పురోగతిని మాత్రమే కోరుకోవాలి.

ఐ-మెయిల్

బదిలీలు ఎప్పుడో?

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉద్యోగుల బదిలీలు గత 6 సంవత్సరాలుగా చేపట్టని కారణంగా ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతూ, నరకయాతన అనుభవిస్తున్నారు. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న వారికి బదిలీలు చేసి ఉంటే కాస్త ఉపశమనం ఉండేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు కోసం ఎన్నో విజ్ఞప్తులు ఎన్నో వినతులు సమర్పిస్తున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2016లో జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ మండలి బదిలీల కోసం ప్రత్యేకమైన మార్గదర్శకాలు నిర్దేశించినా అధికారులు నిర్లక్ష్యంగా ఉద్యోగుల బతుకులతో ఆటలు ఆడుతున్నారు. గతంలో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఐ.ఎ.ఎస్ అధికారులు ఉండి సమర్థవంతంగా సేవలు అందించేవారు, కానీ గత 3 సంవత్సరాలుగా కిందిస్థాయి అధికారులనే ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కొనసాగిస్తున్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వాస్తవ లక్ష్యాలని వీరు నిర్వీర్యం చేస్తున్నారు. ఈ బదిలీల అంశంపై పలువురు మంత్రుల నుంచి, పార్లమెంటు సభ్యుల నుంచి, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి నుంచి లేఖలు, న్యాయస్థానాల నుంచి ఆదేశాలు, అనేక విజ్ఞప్తులు వారికి వెళ్ళినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కుంటి సాకులు చెబుతూ, కాలం గడిపేస్తూ పదవీ విరమణ చేసి వెళ్ళిపోతున్నారు. 2020లో, 2021లో బదిలీల కోసం దరఖాస్తులు ఆహ్వానించి నేటివరకు చేయకుండా వారి బతుకులతో ఆడుకుంటున్నారు. దాదాపు 13 వందలమంది ఉద్యోగులున్న ఈ విభాగంలో 250కి పైగా ఖాళీలున్నాయి. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారిపై దయ చూపి వెంటనే బదిలీలు చేపట్టాలని, వారిని, వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఉద్యోగులంతా కోరుతున్నారు.

టేకి. సురేష్ కుమార్, 8500962989

సిర్పూర్కర్ నివేదికైనా కనువిప్పు కలిగించేనా?

తిప్పినేని రామదాసప్ప నాయుడు

పోలీసులు చేస్తున్న ఎన్‌కౌంటర్లలో ఎక్కువ భాగం బూటకపు ఎన్‌కౌంటర్లే. రెండేళ్ల కిందట హైదరాబాద్ నగర శివారులో జరిగిన దిశ ఘటన యావత్ భారతావనిని కలచివేసింది. దిశ ఘటనకు కారకులైన దోషులను అప్పుడు పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. పోలీసుల తూటాలకు బలైన నలుగురిలో ముగ్గురు యువకులు మైనర్లు కావడం గమనార్హం. దిశను హింసించి హత్య చేసినందుకు ఆ మూర్ఖులను శిక్షించవలసిందే. కానీ ఆ శిక్ష రాజ్యాంగం, చట్టాల ప్రకారం ఉండాలి. స్పాట్ జడ్జిమెంట్ అన్నట్టుగా సిని మాల్లో తీర్పుల మాదిరిగా పోలీసులు, వారి వెనుకనున్న పాలకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం ఆక్షేపణీయం. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ గురించి 2019లో భారత ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ వి.ఎస్.సిర్పుర్కర్ నేతృత్వంలో ఓ కమిషన్ వేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన దిశ నిందితులలో ఎవరికీ పోలీసులను ప్రతిఘటించే అవకాశం, ఆ స్థాయి శక్తి, బలం లేవని, పోలీసులే కట్టుకథలల్లారని, పోలీసులే వారిని హత్య చేశారని ఇందుకు సంబంధిత పోలీస్ అధికారులైన పది మంది మీద హత్యానేరం కేసు నమోదు చేసి నేరుగా హైకోర్టులో విచారించాలని పేర్కొన్నారు. ఇప్పుడు పోలీసుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇరకాటంలో పడింది.

వాస్తవంగా ఇటువంటి నిందితులకు గట్టి శిక్ష పడాలి. వరంగల్‌లో రెండేళ్ల కిందట ఓ చిన్నారిపై హత్యాచారం ఘటనలో అప్పటి వరంగల్ నగర కమిషనర్ డా॥ వి.రవీందర్ నిందితునికి కేవలం నెల రోజుల్లోనే శిక్ష పడేలా చేశారు. ఇలాగే 2012-2014 మధ్య సైబరాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ మహిళా ఇంజనీరును ఒక క్యాబ్ డ్రైవర్ నిర్భయ ఘోరం తరహాలో హత్యాచారం చేశాడు. ఈ ఘటనకు అప్పటి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (నేటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్) సి.వి.ఆనంద్ 'అభయ' అనే పేరు పెట్టి నిందితునికి 40 రోజుల్లోనే శిక్ష పడేటట్లు శ్రమించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో రమ్య అనే యువతిని ప్రేమించలేదని ఓ దుర్మార్గుడు నడి రోడ్డు మీద హత్య చేసిన ఉదంతంలో స్థానిక ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసుల కోర్టు ఆ నిందితునికి ఉరిశిక్ష వేసింది. ఈ కేసు ఎనిమిది నెలల్లోనే విచారణ పూర్తి చేసుకుంది. ఇలా సంబంధిత దోషులకు, నిందితులకు, మానవ మృగాలకు తక్కువ సమయంలో శిక్ష పడేవిధంగా పాలకులు పోలీసులకు కావలసిన సాంకేతిక వనరులు, ఆర్థిక వనరులు సమకూర్చాలి. ఇటువంటి కేసులకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి. ఈ విధంగా కాకుండా రాజకీయ లబ్ధితోనో లేక మరో ప్రయోజనాలు ఆశించో పాలకులు పోలీసుల చేత నకిలీ ఎన్‌కౌంటర్లు చేయించడం ఈ మధ్య కాలంలో సర్వసాధారణంగా మారింది. తెలంగాణ పాలకులు 2016లో నయీం అనే ఓ కరుడుగట్టిన మాఫియా రౌడీని ఎన్‌కౌంటర్ చేయించారు. ఆ నయీంను దశాబ్దాలపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నందలి పాలకులు, నాయకులు, పోలీసులు ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రముఖులు పెంచి పోషించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రముఖులైన ఇద్దరు ముగ్గురిని నయీం బెదిరించడంతో ఎన్‌కౌంటర్ ద్వారా ఖతం చేయించారనే గుసగుసలు అప్పట్లో వినిపించాయి. నయీం నేరాలు, ఘోరాల గురించి అతనికి సహకరించిన ప్రముఖుల చిట్టాను బయటికి తీయడం గురించి ప్రభుత్వం ప్రత్యేక 'సిట్' ను ఏర్పాటు చేసింది. ఆ సిట్ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా అసలైన పెద్దలను వదిలేసి నయీంతో అంటకాగిన కింది స్థాయి సీఐలు, డీఎస్పీలు, జడ్పీటీసీలు, ఎమ్.పి.పి.లు వంటి వారిని పది పదిహేను మందిని మాత్రమే అరెస్ట్ చేసింది. ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరుల జోలికి పోలేదు. నయీం అక్రమ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వాటి వివరాలను నేటికీ బయట పెట్టలేదు. ఇప్పటికీ నయీం అక్రమాస్తుల వివరాలను గురించి, ఎన్‌కౌంటర్ వెనుక దాగిన అసలు కథ గురించి సీబీఐ చేత విచారణ జరిపించాలని కొంతమంది డిమాండ్ చేస్తూనే వున్నారు. ఇదేవిధంగా కొన్ని చోట్ల జైళ్లల్లో కూడా హత్యలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయి. వాస్తవంగా జైళ్లల్లో రిమాండ్ ఖైదీలకు, శిక్షలు పడిన ఖైదీలకు ప్రత్యేకంగా బలమైన నిబంధనలతో పటిష్టమైన ఆంక్షలతో రక్షణ వుంటుంది. జైలు గోడలు ఆనాటి రాజుల కోటలను మించిన బందోబస్తుతో ఎత్తైన గోడలతో, సోలార్ ఫెన్సింగ్‌తో, పెద్ద పెద్ద దూంలైట్లతో, సీసి కెమెరాలతో, శతృదుర్భేద్యం అనే తరహాలో వుంటాయి. అటువంటి జైళ్లలో హత్యలు ఆత్మహత్యలు జరుగుతున్నాయంటే ఏమనాలి? 2006-2009 మధ్య అనంతపురం జిల్లాలో పరిటాల రవి కేసులో ముద్దాయిగా రిమాండ్ ఖైదీగా వున్న మొద్దు శీనును మరోకేసులో సహ నిందితుడైన ఓం ప్రకాశ్ హత్య చేశాడని అప్పుడు పెద్ద దుమారం రేగింది. ఓం ప్రకాశ్ నేనే హత్య చేశానని ఒప్పుకున్నాడు. దీని వెనుక మరో కథ వుందని ఇప్పటికీ విమర్శలు వినిపిస్తూనే వున్నాయి. ఏడాదిన్నర కిందట తెలంగాణలో ఏసీబీ కేసులో పట్టుబడిన కీసర ఎమ్మార్వో నాగరాజు జైల్లో రిమాండ్ ఖైదీగా వుంటూ ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ఈ ఆత్మహత్య వెనుక కూడా మరో కోణం వుందని, పెద్దల ప్రమేయం వుందని ఆరోపణలు వున్నాయి. ఇలా తెర వెనుక జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్ల రూపంలో జరుగుతున్న హత్యలకు ముగింపు పలకాలి. మన పాలకులకు బాగా ఉపయోగపడుతున్న నాటి బ్రిటీష్ బానిస పోలీస్ చట్టాన్ని మార్చాలి. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలి. తాజాగా వచ్చిన సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ద్వారానైనా అటు పాలకులు, ఇటు పోలీసులు మేల్కొనాలి. పోలీసులకు ఎఫ్.ఐ.ఆర్. ఎలా కావాలంటే అలా రూపొందించే పెన్ పవర్ వుంది. నాన్‌బెయిలబుల్ కేసును బెయిలబుల్‌గా, బెయిలబుల్ కేసును నాన్ బెయిలబుల్‌గా మార్చేసేటటువంటి పోలీస్ ప్రబుద్ధులు నేడు అడుగడుగునా వున్నారు. అందుకే ఈ మధ్యన మూడు నెలల కిందట చెన్నై హైకోర్టు... పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎనభై శాతం అవినీతి పరులు వున్నారని సంచలన తీర్పు వెలువరించింది. ఈ మధ్య కాలంలో కొంతమంది న్యాయమూర్తులు, జస్టిస్‌లపై వస్తున్న ఆరోపణలు, వెలుగు చూస్తున్న అవినీతిని కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందుకే పోలీస్ వ్యవస్థతో పాటు న్యాయవ్యవస్థలో కూడా తప్పనిసరిగా సంస్కరణలు రావాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది.

వ్యాస రచయిత ముద్ర అగ్రికల్చర్ & స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఛైర్మన్

అసాధారణ రీతిలో 'చార్‌ధామ్' మరణాలు

- నెల తిరక్కుండానే 78 మంది యాత్రికుల మృతి
- నిపుణుల ఆందోళన
- సౌకర్యాలలేమి, కోవిడ్ చరిత్ర, రోగనిరోధకత లోపం వల్లేనని వెల్లడి
- ఆరోగ్య మార్గదర్శకాలు పాటించాలని సూచన

డెహ్రాడూన్: కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల విరామం తర్వాత చార్‌ధామ్ యాత్ర తిరిగి ప్రారంభం కావడంతో దీనిపై ఆధారపడి జీవిస్తున్న వేలాదిమంది సంతోషిస్తున్నారు. అయితే నెల రోజులు తిరక్కుండానే హిమాలయాల్లోని ఆలయాలకు వెళ్లే మార్గంలో 78మంది యాత్రీకులు మృతి చెందడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత ఎత్తులో ఉండే ఈ తీర్థ క్షేత్రాలకు వెళ్లే యాత్రీకులు గుండె సంబంధిత సమస్యల కారణంగా మరణించడం ప్రతి సంవత్సరం జరిగేదే అయినప్పటికీ, మే 3న యమునోత్రి, గంగోత్రి ఆలయాలను తెరవడంతో యాత్ర ప్రారంభమైన తర్వాత ఈ సీజన్‌లో అసాధారణరీతిలో మరణాలు నమోదయ్యాయి. గడచిన సంవత్సరాల్లో యాత్రీకుల మరణాల డేటాను పరిశీలిస్తే... సీజన్ మొత్తం (దాదాపు ఆరు నెలల కాలం) అంటే ప్రతి సంవత్సరం ఏప్రిల్-మే నుండి అక్టోబర్-నవంబర్ వరకు చూసినట్లయితే... 2019లో 90 మందికి పైగా చార్‌ధామ్ యాత్రీకులు మరణించారు, 2018లో 102 మంది, 2017లో 112 మంది మరణించారు. ఈసారి మాత్రం నెలరోజుల్లోనే 78మంది మృతిచెందడం ఆందోళన కలిగించే పరిణామమని నిపుణులు చెబుతున్నారు. దీనిపై కేదార్‌నాథ్‌లో ఉచిత వైద్య సదుపాయాలను అందించే సిక్స్ సిగ్మా హెల్త్‌కేర్‌కు నేతృత్వం వహిస్తున్న డాక్టర్ ప్రదీప్ భరద్వాజ్ మాట్లాడుతూ... వాతావరణ పరిస్థితులకు అలవాటుపడే ఉపకరణాలు లేకపోవడం, యాత్రికుల బలహీన రోగనిరోధక శక్తి, కోవిడ్ నేపథ్యం, అనిశ్చిత వాతావరణం, యాత్రీకుల రద్దీకి తగ్గట్లుగా తగు ఏర్పాట్లు చేయకపోవడం సహా అధిక మరణాలకు అనేక కారణాలున్నట్లు వెల్లడించారు. చాలా మంది యాత్రికులు ఎత్తయిన ప్రదేశాలకు అలవాటుపడనందున, తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వారి ప్రయాణానికి విరామం ఇవ్వాలి. దీనివల్ల వారు ఎత్తైన ప్రదేశాలలో ఉండే వాతావరణానికి తమను తాము అలవాటు చేసుకోవడానికి దోహదం చేస్తుంది. 'తక్కువ ఎత్తుల నుండి సగటున 10,000 నుండి 12,000 అడుగుల ఎత్తులో ఉన్న హిమాలయ దేవాలయాలకు వచ్చిన తర్వాత ఎదురయ్యే ఆకస్మిక వాతావరణ మార్పులను వారు తట్టుకోలేకపోతున్నారు' భరద్వాజ్ పీటీఐకి చెప్పారు. ఎత్తైన ప్రాంతాలలో విపరీతమైన చలి పరిస్థితులు నెలకొంటాయని తెలియక చాలా మంది యాత్రికులు సరైన దుస్తులతో రావడం లేదని తెలిపారు. 'కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో మరణించిన వారిలో చాలా మంది తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా అల్పోష్ణస్థితితో మరణించినట్లు మేము గమనించాము' అని చెప్పారు. కేదార్‌నాథ్‌లో మధ్యాహ్న వాతావరణం తరచుగా చెడుగా మారుతుంది. ప్రకాశవంతమైన ఎండ ఉన్నరోజున ఆకస్మికంగా మేఘావృతమై వర్ష పరిస్థితులకు దారి తీస్తుంది. కేదార్‌నాథ్‌కు మూడు కిలోమీటర్ల పరిధిలో రెయిన్ షెల్టర్‌లు లేనందున యాత్రికులు తరచుగా తడిసిపోయి చివరకు అల్పపీడనానికి గురవుతున్నారని ఆయన చెప్పారు. ఇప్పటివరకు మరణించిన 78 మందిలో ఒక్క కేదార్‌నాథ్‌లో 41మంది మరణించారు. కోవిడ్ చరిత్ర కలిగిన యాత్రికుల రోగనిరోధక శక్తి బలహీనంగా ఉండటం కూడా అధిక సంఖ్యలో మరణాలకు మరో కారణమని ఆయన అన్నారు. యాత్రికులు ఆలయాలకు కష్టతరమైన ట్రెక్కింగ్ ప్రారంభించే ముందు ఆరోగ్య తనిఖీలు కూడా చేయించుకోవాలని పేర్కొన్నారు. కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో మరిన్ని కమ్యూనిటీ కిచెన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. 10 వేల మంది యాత్రికుల స్థానంలో 50వేల మంది యాత్రికులు వస్తున్నారని, కేవలం మూడు కమ్యూనిటీ కిచెన్‌లు మాత్రమే ఉన్నాయని భరద్వాజ్ చెప్పారు. అదే అమర్‌నాథ్ ఆలయానికి వెళ్లే మార్గంలో 130 కమ్యూనిటీ కిచెన్‌లు ఉన్నాయన్నారు. ఎత్తైన ప్రదేశాలకు వెళ్లే ముందు యాత్రీకులకు పెద్ద ఎత్తున ఆరోగ్య పరీక్షలు జరగాలని భరద్వాజ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్య మార్గదర్శకాలను యాత్రీకులు పట్టించుకోలేదని కేదార్‌నాథ్-బద్రీనాథ్ మందిర్ సమితి చైర్మన్ అజేంద్ర అజయ్ అన్నారు. హిమాలయ దేవాలయాల వద్ద యాత్రికుల కాలినడక వారి సామర్థ్యం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది వారికి అసౌకర్యాన్ని కలిగిస్తుందని చెప్పారు. కోవిడ్ సోకిన చరిత్ర ఉండటం లేదా కోవిడ్ అనంతర సమస్యలతో బాధపడుతుంటే వారు ప్రయాణం చేయకూడదని ప్రభుత్వం సూచించినప్పటికీ యాత్రీకులు తీర్థయాత్రకు బయలుదేరుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధుల విషయంలో ఇది ప్రాణాంతకంగా మారుతోందని అజయ్ పీటీఐకి చెప్పారు.

ఎన్‌కౌంటర్‌లో నటి హంతకుల మృతి

శ్రీనగర్: కశ్మీరు టీవీ నటి అమ్రీన్ భట్‌ను దారుణంగా హత్య చేసిన ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. పుల్వామా, శ్రీనగర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం నలుగురు లష్కరే తొయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో ఇద్దరు ఈ నటిని హత్య చేసినవారని జమ్మూ-కశ్మీరు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసు అధికార ప్రతినిధి ఒకరు శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం, పుల్వామా జిల్లాలోని అవంతిపొరలో అగన్జంజిపొర ప్రాంతంలో గురువారం రాత్రి ఎన్‌కౌంటర్ జరిగింది. బుద్గాం జిల్లాలో టీవీ నటి అమ్రీన్ భట్‌ను బుధవారం హత్య చేసిన ఇద్దరు ఉగ్రవాదులు షాహిద్ ముష్తాక్ భట్, ఫర్హాన్ హబీబ్ ఈ ఎన్‌కౌంటర్లో మరణించారు. వీరు లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థ కమాండర్ లతీఫ్ ఆదేశాల మేరకు అమ్రీన్‌ను హత్య చేశారు. వీరి నుంచి ఒక ఏకే 56 రైఫిల్, 4 మ్యాగజైన్స్, ఓ పిస్తోలును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను కశ్మీరు జోన్ ఐజీపీ విజయ్ కుమార్ ఓ ట్వీట్‌లో ధ్రువీకరించారు. శ్రీనగర్ సిటీలోని సౌర ఏరియాలో మరొక ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు తెలిపారు. గడచిన మూడు రోజుల్లో కశ్మీరు లోయలో జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులు, ఏడుగురు లష్కరే తొయిబా ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపారు.

ఫోన్ మోగితే సీజ్... ఎమ్మెల్యేలకు స్పీకర్ హెచ్చరిక

లక్నో: సభా కార్యకలాపాల సమయంలో మొబైల్ ఫోన్ రింగైతే దానిని జప్తు చేస్తామని ఉత్తరప్రదేశ్ శాసనసభ స్పీకర్ సతీష్ మహానా శుక్రవారం హెచ్చరించారు. సభ్యులు తమ మొబైల్ ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేయాలని మహానా కోరారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఒక సభ్యుని మొబైల్ ఫోన్ మోగడంతో మహానా పై విధంగా హెచ్చరించారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. ఇది సరికాదు. ఇప్పుడు, ఎవరి ఫోన్ రింగ్ అయినా, అది జప్తు చేయబడుతుంది. సభా కార్యకలాపాల సమయంలో సభ్యులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు.

మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ : నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో ఆయన్ను మే 31న ఢిల్లీలో ప్రశ్నించనున్నట్లు అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈడీ దర్యాప్తు చేస్తున్న జమ్ముకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ)లో ఆర్థిక అవకతవకల ఆరోపణల కేసులో ప్రశ్నించనున్నది. మే 31న ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి హాజరుకావాలని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద సమన్లు జారీ అయ్యాయి. కాగా శ్రీనగర్ నుంచి లోక్‌సభ ఎంపీగా ఉన్న ఫరూక్ అబ్దుల్లాకు సమన్ల జారీపై ఆయన పార్టీ స్పందిస్తూ, గతంలో లాగా అధికారులకు సహకరిస్తూనే ఉంటారని తెలిపింది. 'జేకేఎన్‌సీ అధ్యక్షుడు డాక్టర్ ఫరూక్ అబ్దుల్లాకి ఈడీ సమన్లు కొత్త విషయమేమీ కాదు. భారత్‌లోని అన్ని ప్రతిపక్ష పార్టీలకు ఇది సాధారణం. ఆయన ఈ కేసులో తన నిర్దోషిత్వాన్ని కొనసాగిస్తారు. దర్యాప్తు సంస్థలకు సహకరిస్తారు' అని పార్టీ ట్విట్టర్‌లో పేర్కొంది.

ద్వేషపూరిత ప్రసంగం కేసులో పీసీ జార్జ్‌కు బెయిల్

కొచ్చి: సీనియర్ రాజకీయ నాయకుడు పీసీ జార్జ్ చేసిన ద్వేషపూరిత ప్రసంగంపై తిరువనంతపురంలో కేసు నమోదైంది. ఈ కేసులో తాజాగా కేరళ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. బుధవారం జార్జ్‌ను అరెస్టు చేసి తిరువనంతపురం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఏప్రిల్ 29న ముస్లింలకు వ్యతిరేకంగా ఆయన చేసిన ద్వేషపూరిత ప్రసంగం కేసులో ప్రధాన నిందితుడిగా భావించి కోర్టు మొదట బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అంతకుముందు పీసీ జార్జ్ ఏప్రిల్ 29న జరిగిన 'అనంతపురి హిందు మహా సమ్మేళనం' సభలో ముస్లింపై మతపరంగా ద్వేషపూరిత ప్రసంగం చేయడంతో మే 1న పోలీసులు అరెస్టు చేశారు. కేరళలో ముస్లింలు నడిపే హోటళ్లలో, రెస్టారెంట్లలో భోజనం చేయడం మానుకోవాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే, మే10వ తేదీన ఎర్నాకుళంలోని పలరాయివాట్టం పోలీసు స్టేషన్‌లో ద్వేషపూర్తి ప్రసంగంపై మరో కేసు నమోదైంది. మే 25న బెయిల్ నిబంధనలు అతిక్రమించారనే నెపంతో ఆయన అరెస్టు చేశారు.

ప్రముఖ జర్నలిస్ట్ సాత్ సోని కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ జర్నలిస్టు, రచయిత్రి సత్ సోనీ (89) గురుగ్రామ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆయన మయన్మార్‌లోని మాండలేలో జన్మించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ దాడి నేపథ్యంలో 1944లో పంజాబ్‌లో స్థిరపడ్డారు. జలంధర్‌లో విద్యాభ్యాసం చేశారు. అక్కడ మొదటిసారి ఉర్దూ, హిందీ నేర్చుకున్నారు. 'దేశంలోని అత్యంత సీనియర్ హిందీ జర్నలిస్టులలో ఒకరైన సత్ సోనీ గురువారం గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు" అని కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన 1951లో ఉర్దూ దినపత్రిక "మిలాప్"లో చేరడం ద్వారా భాషా జర్నలిజంలో తన వృత్తిని ప్రారంభించారు. తర్వాత 50వ దశకం మధ్యలో బెన్నెట్ కోల్‌మన్ అండ్ కోలో చేరారు.1979 వరకు "సంధ్యా టైమ్స్" ప్రారంభించడానికి ఎంపికైనప్పుడు "నవభారత్ టైమ్స్"లో ఉన్నారు. సోనీకి భార్య, కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్లు ఉన్నారు.

జలాంతర్గామిలో రక్షణ మంత్రి ప్రయాణం

కార్వార్ (కర్ణాటక): రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం జలాంతర్గామిలో సముద్రయానం చేశారు. "ఈరోజు నేను 'ఐఎన్ఎస్ ఖండేరీ'లో సముద్రంలో ప్రయాణించినప్పుడు అద్భుతమైన అనుభవం కలిగింది" అని ఆయన ట్వీట్ చేశారు. 'సముద్రపు అడుగున గంటల తరబడి గడిపా. అత్యాధునిక కల్వరి క్లాస్ సబ్‌మెరైన్ పోరాట సామర్థ్యాలు, ప్రమాదకర బలాన్ని చూశా" అని సింగ్ తెలిపారు. భారత నౌకాదళం నీటి అడుగున సామర్థ్యాన్ని చూసిన తర్వాత దేశ భద్రతపై తనకు మరింత భరోసా వచ్చిందని మంత్రి అన్నారు. భారత నావికాదళం ఒక ఆధునిక, శక్తిమంతమైన విశ్వసనీయ శక్తి, ఇది ప్రతి పరిస్థితిలోనూ అప్రమత్తంగా, పరాక్రమంగా విజేతగా ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉందని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు.

డీఎంఎఫ్ నిధులతో కోవిడ్‌పై పోరు

రూ.1460 కోట్ల వ్యయమని గనుల శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: గత రెండేళ్లలో కోవిడ్-19 నియంత్రణకు వివిధ కార్యకలాపాలపై జిల్లా మినరల్ ఫౌండేషన్ నిధుల (డీఎంఎఫ్) నుండి రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం రూ. 1,459.93 కోట్లు ఖర్చు చేసినట్లు గనుల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒడిశా, తెలంగాణ, కర్ణాటకతో సహా అనేక రాష్ట్రాలు ఇప్పటికీ కరోనావైరస్‌తో పోరాడేందుకు డీఎంఎఫ్ నిధులను వెచ్చిస్తున్నాయని తెలిపింది. డీఎంఎఫ్ అనేది లాభాపేక్ష లేని చట్టబద్ధ ట్రస్ట్. ఇది గనుల తవ్వకం సంబంధిత కార్యకలాపాల వల్ల ప్రభావితమైన జిల్లాల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడింది. డీఎంఎఫ్ కింద సేకరించిన నిధులను ప్రభావిత ప్రాంతాల ప్రజల సంక్షేమానికి వినియోగిస్తారు. మార్చి 28, 2020 నాటికి డీఎంఎఫ్ కింద అందుబాటులో ఉన్న మొత్తం నిధులు రూ.14,694.47 కోట్లని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే కోవిడ్-19తో పోరాడేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో 2022 ఏప్రిల్ 28 వరకు (మార్చి 28, 2020- ఏప్రిల్ 28, 2022 మధ్య కాలం) రూ. 1,459.93 కోట్లు ఖర్చు చేశాయని మంత్రిత్వ శాఖ వివరించింది. ఒడిశా గరిష్ఠంగా రూ. 445.54 కోట్లు, తెలంగాణ రూ. 334.08 కోట్లు , కర్ణాటక రూ.199.58 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.139.79 కోట్లు, ఛత్తీస్‌గఢ్ రూ.91 కోట్లు వినియోగించుకున్నాయి. కోవిడ్-19ని ఎదుర్కోవడానికి డీఎంఎఫ్ నిధులను ఖర్చు చేసిన ఇతర రాష్ట్రాలు అసోం, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్. అయితే, బీహార్, హరియాణా, కేరళ రాష్ట్రాలు మార్చి 28, 2020 నుండి గత నెల వరకు కోవిడ్-19కి సంబంధించిన కార్యకలాపాల కోసం నిధులను ఖర్చు చేయలేదు. మార్చి 28, 2020 నాటికి బీహార్‌లో రూ. 84.50 కోట్ల డిఎంఎఫ్ ఫండ్, హరియాణాలో రూ. 20.24 కోట్లు, కేరళలో రూ. 2 కోట్లు ఉన్నాయి. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ చట్టం, 2015లోని నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలో డీఎంఎఫ్ ఏర్పాటైంది.

రాజ్యసభ ఎన్నికల రేసు నుంచి

వైదొలిగిన శంభాజీ ఛత్రపతి

ముంబై : శివాజీ మహరాజ్ వారసుడు, ప్రముఖ మరాఠా నాయకుడు శంభాజీ ఛత్రపతి త్వరలో రాజ్యసభ ఎన్నికల రేసు నుంచి శుక్రవారం తప్పుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన ప్రకటించిన కొద్ది రోజులకే ఈ తాజా నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే తన నిర్ణయం 'హార్స్ ట్రేడింగ్' నిరోధించే లక్ష్యంతో ఉందని, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే తనకు రెండవసారి ఎగువ సభలో శివసేన మద్దతును అందిస్తానని ఇచ్చిన హామీని ఉల్లంఘించారని ఆరోపించారు. శంభాజీ ఛత్రపతి రాజ్యసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించి, శివసేన సహాయం కోరాడు. అయితే పార్టీ తన అధికారిక అభ్యర్థిగా పోటీ చేయాలని పట్టుబట్టింది. కానీ ఆయన అందుకు అంగీకరించలేదు. సేన అభ్యర్థులు సంజయ్ రౌత్, సంజయ్ పవార్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన ఒక రోజు తర్వాత రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయబోనని శంభాజీ ఛత్రపతి ప్రకటించారు. ఈ మాజీ ఎంపీ మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే నాకు మద్దతుగా మాట ఇచ్చారు. కానీ ఆయన దానిని వెనక్కి తీసుకున్నాడు. నేను దాని గురించి చాలా విచారంగా ఉన్నాను. నేను ఇప్పుడు రాజ్యసభ సీటు రేసులో లేను' అని తెలిపారు. మహారాష్ట్రలోని ఆరు రాజ్యసభ స్థానాలకు జూన్ 10న ఎన్నికలు జరగనున్నాయి. ప్రతిపక్ష బీజేపీ నుంచి ఇద్దరు అభ్యర్థులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. రాష్ట్రపతి కోటాలో 2016లో శంభాజీ ఛత్రపతి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇటీవల ఆయన పదవీ కాలం ముగిసింది. ఈసారి బీజేపీకి తక్కువ ఎమ్మెల్యేలు ఉన్నందున శంభాజీ ఎన్‌సీపీ, తర్వాత సేనను సంప్రదించాడు. మహా వికాస్ అఘాది (ఎంవీఏ) ప్రభుత్వంలో భాగంగా కాంగ్రెస్‌తో సేన, ఎన్‌సీపీ రాష్ట్రంలో అధికారాన్ని పంచుకున్నాయి. 'పార్టీలో చేరితే రాజ్యసభ టికెట్ ఇస్తానని శివసేన నాకు ఆఫర్ ఇచ్చింది. అయితే నేను ఏ పార్టీలోనూ ఉండబోనని ఇప్పటికే ప్రకటించాను. అందుకే, నేను ఆఫర్‌ని అంగీకరించలేదు' అని ఆయన చెప్పారు. 'ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నా నిర్ణయం తిరోగమనం కాదు. ఇది నా గర్వం' అని అన్నారు. శంభాజీ ఛత్రపతి 2009లో ఎన్‌సీపీలో చేరి కొల్హాపూర్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఎన్‌సీపీ తిరుగుబాటు అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. 'నా క్లీన్ ఇమేజ్, నా పని కోసం పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేల మద్దతును నేను ఆశించాను. అయితే, నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే 'హార్స్ ట్రేడింగ్' జరుగుతుందని నాకు తర్వాత ఒక విషయం అర్థమైంది. దాన్ని నివారించేందుకే ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాను' అని చెప్పారు. కాగా రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేయడానికి మే 31 చివరి తేదీ. జూన్ 1న పత్రాల పరిశీలన జరుగుతుంది. జూన్ 3 వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. జూన్ 10న పోలింగ్ రోజున ఫలితాలు వెలువడతాయి.

మహారాష్ట్రలో హవాలా రాకెట్ గుట్టురట్టు

రూ.కోటి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం

ముంబై : మహారాష్ట్రలో రైల్వే భద్రతా దళం (ఆర్‌ఎఫ్‌పీ) ఒక హవాలా రాకెట్‌ను గుట్టురట్టు చేసింది. థానే జిల్లాలో కల్యాణ్ రైల్వే స్టేషన్ వద్ద కోటి రూపాయల నగదు, రూ.9 లక్షలకు పైగా విలువ చేసే బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. గురువారం ఆర్‌పీఎఫ్‌కు చెందిన నిఘా విభాగం ఐదుగురు వ్యక్తుల నుంచి రూ.1.1 కోట్ల నగదు, రూ.9.14 లక్షల విలువ చేసే 178 గ్రాములకు పైగా బంగారంను స్వాధీనం చేసుకుందని మధ్య రైల్వే పౌర సంబంధాల ప్రధానాధికారి శివాజి సుతార్ శుక్రవారం తెలిపారు. ఆర్‌పీఎఫ్ బృందం ముందస్తు తనిఖీలు నిర్వహిస్తుండగా, ముంబైలో అందజేసేందుకు బంగారం, హవాలా నగదు తీసుకువెళుతున్న కొరియర్ కంపెనీకి చెందిన ఐదుగురు ఉద్యోగులను పట్టుకున్నట్లు చెప్పారు. ఈ హవాలా రాకెట్ గురించిన సమాచారాన్ని ఈ రైల్వే డివిజనల్ సీనియర్ భద్రతా కమిషనర్ అందుకున్నారు. ఆ విషయాన్ని పూణె సర్కిల్ అదనపు డైరెక్టర్‌కి పంపారు. దీనితర్వాత కల్యాణ్ స్టేషన్ వద్ద ఉన్న ఆర్‌పీఎఫ్ పోస్టు సిబ్బందితో కలిసి వారిని నిర్బంధించినట్లు వివరించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణను ఆదాయపు పన్ను విభాగం చేపట్టనున్నది.

నెహ్రూకి జాతి నివాళి

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకి జాతి ఘనంగా నివాళి అర్పించింది. ఆగస్టు 1947-మే 1964 మధ్య భారతదేశ తొలి ప్రధాన మంత్రిగా నెహ్రూ పని చేశారు. నెహ్రూ మే 27, 1964లో కన్నుమూశారు. 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీకి ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు' అని ప్రధాని నరేంద్రమోదీ ట్వీట్ చేశారు.

ఆధునిక భారతదేశ రూపశిల్పి : కాంగ్రెస్

జవహర్‌లాల్ నెహ్రూ 58వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ శుక్రవారం ఆయనకు నివాళులు అర్పించింది. భారతదేశ మొదటి ప్రధాని దేశానికి సంబంధించిన ఆలోచనలు, రాజకీయాలు, దార్శనికత ఆయన మరణించిన 58 సంవత్సరాల నుంచి కూడా సంబంధితంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తెలిపారు. ఇక్కడి శాంతి వనంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఒక ట్వీట్‌లో 'ఈ అమర భారత పుత్రుని విలువలు ఎల్లప్పుడూ మన చర్యలకు, మనస్సాక్షిని మార్గనిర్దేశం చేస్తాయి' అని పేర్కొన్నారు. కాగా నెహ్రూను వీర స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధునిక భారతదేశానికి రూపశిల్పి, రాజనీతిజ్ఞుడు, దూరదృష్టి గలవాడు, దేశభక్తుడు, భారత మాత నిజమైన కుమారుడు' అని కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో కీర్తించింది. 'మన మొదటి ప్రధాన మంత్రి వర్ధంతి సందర్భంగా ఆయనకు శతకోటి వందనాలు, బిలియన్ నివాళులు' అని ట్వీట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్, పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ వంటి అనేక మంది సీనియర్ కాంగ్రెస్ నేతలు కూడా నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు.

యూపీలో ఖాకీల దాష్టీకం

బాధిత కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ బాగ్‌పేటలోని బచోద్ గ్రామానికి చెందిన ఆరుగురితో కూడిన కుటుంబంపై ఖాకీలు తమ క్రౌర్యాన్ని ప్రదర్శించారు. దళిత మహిళను అపహరించిన ఆరోపణలతో 22 ఏళ్ల కుర్రాడి కోసం గాలించే క్రమంలో మంగళవారం అతని ఇంటిని పోలీసులు సోదా చేశారు. కుటుంబ సభ్యులతో క్రూరంగా ప్రవర్తించారు. మెహక్ సింగ్ (నిందితుడి తండ్రి) భార్య, కుమార్తెలను దుర్భాషలాడారు. అవమానించారు. వారితో అనుచితంగా ప్రవర్తించారు. దీంతో సింగ్ భార్య, ఇద్దరు కుమార్తెలు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇంట్లో మహిళలు మాత్రమే ఉన్న సమయంలో పోలీసులు చొరబడగా వారితో పాటు మహిళా పోలీసు లేరని సింగ్ వెల్లడించారు. తమ బిడ్డను లేపుకుపోయాడని మహిళ కుటుంబం సింగ్ కుమారుడిపై ఆరోపణలు చేసింది. ఓబీసీ వర్గానికి చెందిన సింగ్ కుటుంబం కఠిక పేదరికాన్ని అనుభవిస్తోందని బచోద్ గ్రామ ప్రధాన్ విశాల్ బర్ధన్ తెలిపారు. 'భార్య, కుమార్తెలు చనిపోయారు. కుమారుడు ఆచూకీ లేదు. ఇక మిగిలింది తండ్రి ఒక్కడే. ఇంతటి బాధాకరమైన ఘటన గ్రామంలో చోటుచేసుకోలేదు. ఈ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, దోషులతో పాటు పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నామన్నారు. చాప్రౌలీ పోలీసు స్టేషన్ ఇంచార్జి నరేశ్ పాల్‌పై ఐపీసీలోని సెక్షన్ 306 కింద ఎఫ్ఐఆర్‌ను సింగ్ నమోదు చేశారు. కాంతిలాల్, ఆయన కుమారులు శక్తి (23), రాజు (20) పేర్లనూ తన ఫిర్యాదులో సింగ్ పేర్కొన్నారు. వీరు పోలీసులతో పాటు తమ ఇంటికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఎఫ్ఐఆర్ నమోదు అయిందని, పారదర్శకంగా విచారణ జరిగేందుకు క్రైంబ్రాంచ్‌కు కేసు బాధ్యతలు అప్పగించినట్లు హత్రాస్ ఎస్పీ నీరజ్ జాదౌన్ తెలిపారు. మహిళ అపహరణ గురించి తెలిసిన వెంటనే పోలీసులు సింగ్ తమ్ముడు సంజయ్‌ను అదుపులోకి తీసుకొని మూడు రోజులు కస్టడీలో ఉంచారు. ఈ క్రమంలో ఆయనను వేధించారు.

లడఖ్ వాహన ప్రమాదంలో ఏడుగురు సైనికుల మృతి

లేహ్/ న్యూఢిల్లీ: లద్దాఖ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జవాన్లు ప్రయాణిస్తోన్న ఓ వాహనం నదిలో పడి ఏడుగురు దుర్మరణం చెందారు. మరో 19 మంది గాయపడ్డారు. శుక్రవారం ఉదయం పార్థాపూర్ శిబిరం నుంచి 26 మంది సైనికులు వాహనంలో హనీఫ్ సబ్ సెక్టార్ వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. టుర్టుక్ సెక్టార్ ప్రాంతంలో జవాన్లు ప్రయాణిస్తోన్న వాహనం ప్రమాదవశాత్తు రోడ్డుపై నుంచి జారి షియోక్ నదిలో పడింది. సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన జవాన్లను ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఏడుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. గాయపడినవారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. ఎయిర్ అంబులెన్స్‌లో సైనికులను పశ్చిమ కమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంది.

ఆజంఖాన్ బెయిల్ షరతులపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ: సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఆజంఖాన్‌కు అలహాబాద్ హైకోర్టు విధించిన బెయిల్ షరతులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. జౌహర్ యూనివర్సిటీ క్యాంపస్‌కు అనుబంధంగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని రాంపూర్ జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, బేలా ఎం త్రివేదితో కూడిన వెకేషన్ బెంచ్ ఖాన్‌పై అలహాబాద్ హైకోర్టు విధించిన బెయిల్ షరతు అసమానంగా ఉందని, సివిల్ కోర్టు డిక్రీ లాగా ఉందని వ్యాఖ్యానించింది. జౌహర్ యూనివర్సిటీకి సంబంధించి అలహాబాద్ హైకోర్టు విధించిన బెయిల్ షరతును సవాలు చేస్తూ ఆజం ఖాన్ చేసిన పిటిషన్‌పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. ఖాన్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, యూనివర్సిటీ భవనాలను ఖాళీ చేయాలని కోరుతూ జిల్లా మేజిస్ట్రేట్ రాంపూర్ నోటీసు జారీ చేశారని, వాటిని కూల్చివేయాలని కోరుతున్నారని తెలిపారు. హైకోర్టు విధించిన షరతులను నిలుపుదల చేస్తున్నామని, సెలవు తర్వాత దీనిపై విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది. మే 24న, అలహాబాద్ హైకోర్టు విధించిన బెయిల్ షరతును సవాలు చేస్తూ ఖాన్ వేసిన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీం కోర్టు అంగీకరించింది.

ఉచిత విద్యుత్ ఇస్తామంటే ఉలుకెందుకు?

బీజేపీకి కేజ్రీవాల్ చురక

న్యూఢిల్లీ: గుజరాత్ ప్రజలకు ఉచిత విద్యుత్ అందిస్తామన్న తన ప్రతిపాదన కాషాయ పార్టీ ఎందుకు కలవరపెడుతోందో తెలియజేయాలని ఆమ్‌ఆద్మీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బీజేపీని కోరారు. పశ్చిమ రాష్ట్రంలోని మంత్రులు కూడా ఉచిత విద్యుత్ సరఫరాను అందుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కొందరు నాయకులు ప్రకటిస్తున్న ఉచిత హామీలను నమ్మరాదని, వాటివల్ల ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుందని వ్యాఖ్యానించిన గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్‌పై ఆయన మండిపడ్డారు. ప్రజలకు ఉచిత విద్యుత్ అందించడానికి అవినీతిని అంతం చేయాలని కేజ్రీవాల్ అన్నారు. 'పాటిల్ సాహిబ్, మీ మంత్రులకు ఉచిత కరెంటు వస్తుంది, అది సరైందేనా? నేను ప్రజలకు ఉచిత విద్యుత్ అందిస్తే మీరు చాలా ఇబ్బందులు పడుతున్నారు' అని కజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు. 'గుజరాత్ ప్రభుత్వంలో విపరీతంగా అవినీతి ఉంది. ఢిల్లీ, పంజాబ్‌లో మాదిరిగా అవినీతిని అంతమొందిస్తే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించడానికి చాలా డబ్బు ఆదా అవుతుంది' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ నెల ప్రారంభంలో రాజ్‌కోట్‌లో పార్టీ నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించిన కేజ్రీవాల్, ఆప్ అధికారంలోకి వస్తే పాఠశాలలు, ఆసుపత్రుల్లో మెరుగైన పరిస్థితులు కల్పిస్తామని, అయోధ్యతో సహా వివిధ మతపరమైన ప్రదేశాలకు ఎయిర్ కండిషన్ రైళ్లలో సీనియర్ సిటిజన్‌లకు ఉచిత తీర్థయాత్రలు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గుజరాత్‌లో దాదాపు మూడు దశాబ్దాల పాలనలో బీజేపీ అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు.

మాట్లాడుతున్న జల్లి విల్సన్. పక్కన సీహెచ్ కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, అక్కినేని వనజ

ప్రజా సంక్షేమం, అభివృద్ధి

పట్టించుకోని పాలకులు

- ధరలు, పన్నుల భారాలతో ప్రజలు సతమతం
- ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేస్తున్న మోదీ సర్కారు
- దేశాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాలే శరణ్యం
- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విమర్శించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జల్లి విల్సన్ మాట్లాడుతూ మోదీ రెండోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన నిజస్వరూపాన్ని బయటపెట్టి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ అజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ధరలు, పన్నుల భారాలతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా మోదీ ఆగడాలను ప్రశ్నించడంలో విఫలమయ్యాయని చెప్పారు. రైతులకు ద్రోహం చేస్తూ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను చేసినా అడ్డుకోలేదని, పోటీలుపడి మద్దతు ఇచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొంత మేరకు అమలు చేస్తున్నప్పటికీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రం బాగుండాలంటే సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మతోన్మాదుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ గ్రామ స్థాయిలో మరింత బలోపేతమై ప్రజలతో కలిసి పోరాటాలు సాగించాలని సూచించారు. అక్టోబర్‌లో విజయవాడలో నిర్వహించనున్న జాతీయ మహాసభల జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్ ధరలను 300 శాతం పెంచి దానిలో 30 శాతం తగ్గించి ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతోందని, నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోయాయని, సామాన్యులు బతకలేని పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రాలను కేంద్రం తమ గుప్పెట్లో పెట్టుకుని అడ్డగోలుగా కార్పొరేట్‌కు అనుకూలంగా సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,800 కోట్లు ఖర్చు చేయడం సరికాదన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు సబ్సిడీ పేరుతో ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే ప్రమాదం ఉందన్నారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాలు చరిత్రను వక్రీకరిస్తున్నాయని, ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వాటిని అడ్డుకోవాలని, లేకపోతే దేశానికి ప్రమాదమని చెప్పారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ అధిక ధరలు, పన్నుల భారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న కలెక్టరేట్ వద్ద ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ మహాసభలను వెంటనే పూర్తి చేసి జిల్లా మహాసభలకు సిద్ధం కావాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామ స్థాయి నుంచి మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని, ప్రజాపోరాటాలకు రూపకల్పన చేయాలని సూచించారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రైవేటీకరణతో దేశం అస్తవ్యస్థం

- కృషీవలుడు మాదాల రంగారావు
- వర్ధంతి సభలో నారాయణమూర్తి, నల్లూరి

మాట్లాడుతున్న నారాయణమూర్తి. వేదికపై నల్లూరి, ఓబులేశు, చంద్రానాయక్, బాబ్జీ, గని, రవి, విమలక్క, ఈశ్వరయ్య, పీజే చంద్రశేఖర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కళారంగ అభివృద్ధికి మాదాల రంగారావు ఎనలేని కృషి చేశారనీ, కళాకారుల గొంతుకకు సింహ గర్జనగా నిలిచిన మహోన్నత వ్యక్తి మాదాల రంగారావు అనీ, రాయలసీమ ప్రజలు ప్రేమ పిపాసులని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర 10వ మహాసభలలో వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర కళా ఉత్సవాలలో భాగంగా మాదాల రంగారావు కళా ప్రాంగణంలో మాదాల రంగారావు 4వ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం కళా ప్రదర్శనలు, బహిరంగసభ జరిగాయి. సినీ నటులు, దర్శకులు ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ రాయలసీమ ఫ్యాక్షనిజం కాదని కత్తులు, కటారులు చేతపట్టడం పచ్చి అబద్ధమని ఆప్యాయత, అనురాగం, ప్రేమ అభిమానాలకు పుట్టినిల్లు అన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న రుగ్మతలపై దేశంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఉద్వేగభరితంగా ప్రసంగించారు. భారతదేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందని రైల్వే, ఎల్ఐసీ, విశాఖ ఉక్కు వంటి ఎన్నో రంగాలను ప్రైవేటుపరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణిని ప్రదర్శిస్తోందన్నారు. దేశానికి వెన్నెముక, రాజు అన్న రైతులను నేటి కేంద్ర ప్రభుత్వం యాచకులుగా తయారు చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కమ్యునిస్టులందరు ఏకమై పేద ప్రజల గొంతుకగా నిలవాలన్నారు. కళా రూపాలతో ప్రజలను కార్యోన్ముఖులను చేయగలిగే సత్తా ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ మాదాల రంగారావు ప్రజా ఉద్యమాలతో పాటు ప్రజలను రంజింపచేసే సినిమాలను తీసి ప్రజల గుండెల్లో రెడ్‌స్టార్‌గా స్థానం సంపాదించుకున్నారన్నారు. తన కున్న యావదాస్తిని ప్రజా నాట్యమండలికే దారాదత్తం చేసిన యోధుడుగా అభివర్ణించారు. విశాఖపట్నంలో చదువుకునే సమయంలోనే విద్యార్థి దశ నుంచే కార్మిక, కర్షక, నిరుపేదల కోసం అహర్నిశలు కృషి చేసిన మేధావి అన్నారు. సంభవామియుగే యుగే అనే నాటకాన్ని దర్శకులు టీ.కృష్ణతో కలిసి ప్రదర్శించారన్నారు. అలాంటి మహానుభావుని కళాప్రాంగణంలో కళాకారులు గజ్జ కట్టి పాటలు పాడడం చూస్తుంటే ఎంతో ఉత్తేజాన్నిస్తోందన్నారు. సినీ నటులు, నిర్మాత మాదాల రవి మాట్లాడుతూ మాదాల రంగారావుకు వారసుడు నేనొక్కడినే కాదని ప్రజానాట్యమండలిలో ఉన్న కళాకారులందరు ఆయన వారసులేనన్నారు. ఆయుధాల కంటే పదునైనది కళా ప్రదర్శనలు, నాటకాలు, పాటలు అని వాటిని ఊపిరిగా చేసుకొని ప్రపంచంలో ప్రజా నాట్య మండలికి గుర్తింపు తెచ్చిన గొప్ప కళాకారుడుగా మాదాల రంగారావును వర్ణించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క మాట్లాడుతూ రాయలసీమ ఒకప్పుడు రతనాల సీమగా ఉండేదని, ఖనిజ సంపదకు ఏమాత్రం కొదవ లేని సీమను స్వార్థపర శక్తులు వెనుకబాటుతనానికి గురి చేసి తీవ్ర ద్రోహం చేశారని ఎండగట్టారు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై జరుగుతున్న అరాచకాలకు స్వస్తి పలకాలంటే సాంస్కృతిక ఉద్యమం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆర్.నారాయణమూర్తి 'ఎర్ర జెండా ఎర్రజెండా' అనే గేయంతో సభకు హాజరైన కళాకారులను ఉత్తేజితులను చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు, సినీ దర్శకులు బాబ్జీ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, అధ్యక్షులు గని, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ప్రజానాట్య మండలి కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తగ్గిన 'రూ.2 వేలు'

చెలామణిలో ఉన్నవి 214 కోట్ల నోట్లు మాత్రమే

ముంబై: కొన్నేళ్లుగా రూ.2000 నోట్లు వాడుకలో క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది మార్చికి 1.6శాతం అంటే 214 కోట్లు మాత్రమే చెలామణిలో ఉన్నాయని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వార్షిక నివేదిక తెలిపింది. 2020 మార్చి చివరికి వీటి సంఖ్య 274 కోట్లుగా అంటే మొత్తం నోట్లలో 2.4 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. 2021 మార్చికి వీటి సంఖ్య 2 శాతం మేర తగ్గి 245 కోట్లకు చేరింది. ఆ ఆర్థిక సంవత్సరం చివరికల్లా మరింతగా తగ్గి 214 కోట్లు అంటే 1.6శాతంగా ఉంది. చెలామణిలో ఉన్న అన్ని కరెన్సీ నోట్ల సంఖ్య ఈ ఏడాది మార్చికి 13,053 కోట్లుగా ఉండగా అంతకుముందు సంవత్సరం 12,437 కోట్లుగా ఉంది. విలువ పరంగా మొత్తం కరెన్సీ నోట్లలో రూ.2 వేల విలువ 2021 మార్చికి 22.6 శాతం నుంచి 17.3 శాతానికి తగ్గింది. 2022 మార్చికి అది 13.8 శాతానికి చేరిందని ఆర్బీఐ నివేదిక తెలిపింది. రూ.2 వేల నోట్ల చెలామణి తగ్గిపోతూ ఉండగా రూ.500 నోట్ల సర్క్యులేషన్ పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది చివరికి చెలామణిలో ఉన్న రూ.500 నోట్ల సంఖ్య 4,554.68 కోట్లు కాగా ఏడాది క్రితం 3,867.90 కోట్లుగానే ఉంది. రూ.500 నోట్లు అత్యధిక వాటానూ కలిగి ఉన్నాయి. వీటి వాటా 34.9 శాతానికి పెరిగింది. మొత్తం నోట్లలో 21.3 శాతంగా రూ.10 నోట్లు సర్క్యులేషన్‌లో ఉన్నట్టు నివేదిక తెలిపింది. చెలామణిలో ఉన్న అన్ని కరెన్సీ నోట్ల విలువ రూ.31.05 లక్షల కోట్లకు చేరింది. 2021 మార్చి చివరికి అది రూ.28.27 లక్షల కోట్లుగా ఉంది. ప్రస్తుతం చెలామణిలో ఉన్న కరెన్సీ (సీఐసీ)లో బ్యాంకు నోట్లు, నాణేలు ఉన్నాయి. ప్రస్తుతానికి రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500, రూ.2000 నోట్లను ఆర్బీఐ జారీ చేస్తుంది. చెలామణిలో ఉన్న నాణేల్లో 50 పైసలు, రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 ఉన్నాయి.

'పెట్రో' పన్నుల భారం తగ్గించాలి

- నిత్యావసర, వంట నూనెల ధరలు అరికట్టాలి
- ఆర్టీసీ, నీటి, చెత్త పన్నులు నియంత్రించాలి
- సీఎంకి సీపీఐ నేత రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెట్రో ఉత్పత్తులపై పన్నుల భారాలను తగ్గించాలని, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు అరికట్టాలని, విద్యుత్, ఆర్టీసీ బస్సు చార్జీలు, ఆస్తి, నీటి, చెత్త పన్నుల భారాలను విరమించేం దుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడి పెరుగుదలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. వాటికితోడు నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటాయని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, ఆస్తి, నీటి, చెత్త పన్నుల భారాలు ప్రజానీకానికి గుదిబండగా మారాయని పేర్కొన్నారు. ప్రజల ఆదాయ వనరులు ఏమాత్రం పెరగక పోగా ధరలు మాత్రం రెండింతలుగా పెరిగాయన్నారు. పెట్రో ధరలపై కేంద్రం కంటితుడుపు చర్యగా, నవంబర్‌లో లీటరుకు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.10, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించగా, ఇటీవల పెట్రోల్‌పై రూ.8, డీజిల్‌పై రూ.6 ఎక్సైజ్ సుంకం తగ్గించిందని వివరించారు. కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు..పెట్రో ధరలను కొంతమేర తగ్గించాయన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలో పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రం కంటే రూ.10 తక్కువగా ఉండడం గమనార్హమన్నారు. పెట్రో ధరలకు తోడు నిత్యావసర వస్తువులు, వంటనూనెలు, కూరగాయల ధరలు 200శాతం పెరిగాయని వివరించారు. అధిక ధరలకు ఏమాత్రం తీసిపోకూడదన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శ్లాబులను కుదించి, మూడేళ్లలో ఏడు విడతలుగా కరెంటు చార్జీలను పెంచిందని, బస్సు చార్జీల పెంపుతో రూ.720 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఆస్తి, నీటి, చెత్త పన్నులను విపరీతంగా పెంచి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతోందన్నారు. అసలే మెరుగైన జీవన ప్రమాణాలు కొరవడి అల్లాడుతున్న ప్రజానీకానికి ధరల భారం శరాఘాతంగా మారిందని, అధిక ధరలు, పన్నుల భారాలను నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలకు వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సీఎం స్పందించి పెట్రో ఉత్పత్తుల ధరలపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న పన్నుల భారాన్ని తగ్గించి ఉపశమనం కలిగించాలన్నారు. అధిక ధరలను అరికట్టాలని, పెంచిన విద్యుత్, బస్సు చార్జీలను, ఆస్తి, నీటి, చెత్త పన్నుల భారాలను విరమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఏపీ సహా ఆరుగురు హైకోర్టు జడ్జీల బదిలీ

న్యూదిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు హైకోర్టుల న్యాయమూర్తులు ఆరుగురు బదిలీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎహ్‌సానుద్దీన్ అమానుల్లాను పాట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. అలాగే, జస్టిస్ పురుషాయింద్ర కుమార్ గౌరవ్ మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి దిల్లీ హైకోర్టుకు; జస్టిస్ చిత్తరంజన్ దాస్ ఒడిశా హైకోర్టు నుంచి కలకత్తా హైకోర్టు; జస్టిస్ సుభాసిస్ తలపత్ర త్రిపుర హైకోర్టు నుంచి ఒడిశా హైకోర్టుకు; జస్టిస్ లనుసుంగ్‌కుమ్ జమీర్ మణిపూర్ హైకోర్టు నుంచి గువహటి హైకోర్టుకు; జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జమ్మూకశ్మీర్, లఢక్ హైకోర్టు నుంచి బాబే హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కొలీజియం నిర్ణయించినట్లు సర్వోన్నత న్యాయస్థానం వెబ్‌సైట్ పేర్కొంది.

రేపు పాలిసెట్-2022

- సర్వం సిద్ధం
- 404 పరీక్షా కేంద్రాలు
- 1,37,371 మంది విద్యార్థుల నమోదు
- 10 రోజుల్లో ఫలితాల వెల్లడి
- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్-2022)ను రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 29న నిర్వహించడానికి ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పాలిసెట్-2022 నిర్వహణకు రాష్ట్రంలో 26 జిల్లాల్లో 52 సహాయ కేంద్రాలు, 404 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 1,37,371 మంది విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందడానికి పరీక్షకు నమోదు చేసుకున్నారన్నారు. పరీక్షా ఫలితాలను 10 రోజులలో ప్రకటిస్తామ న్నారు. గతంలో కంటే విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగిందని, 2020లో 88,484 మంది, 2021లో 74,884 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 2022లో లక్షా 37 వేల 371 మంది నమోదు చేసుకున్నారని వివరించారు. పాలిసెట్ పరీక్ష మొత్తం 120 మార్కులకు ఉంటుందని, వాటిలో లెక్కలు 50 మార్కులు, భౌతిక శాస్త్రం 40 మార్కులు, రసాయన శాస్త్ర 30 మార్కులకు ఉంటుందన్నారు. వీటిలో ఓసీ, బీసీ విద్యార్థులకు 25 శాతం (30 మార్కులు) సాధించిన వారందరికీ ర్యాంకులు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాసిన వారి అందరికీ ర్యాంకులు కేటాయిస్తామన్నారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, నిర్ణీత సమయం ఉదయం 11 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోనికి ఏ విద్యార్థినీ అనుమతించబోమని తెలిపారు. చాలా హాల్ టికెట్లలో ఫోటోలు బాగా పాతవిగా ఉండటంతో ప్రతి విద్యార్థి తనతో పాటు ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు, పరీక్షలో పాల్గొనే సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఏవీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోవని స్పష్టంచేశారు. పాలిసెట్-2022 ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా కలెక్టర్లను, ఎస్పీలను, ఏపీఎస్ ఆర్టీసీ వారిని, వివిధ మున్సిపాలిటీలను, ఆరోగ్య విభాగం వారి సహాయం కోరామన్నారు. రాష్ట్రంలో మొత్తం 84 గవర్నమెంట్, 175 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు 29 బ్రాంచ్‌లలో మూడేళ్ల డిప్లొమా కోర్సులను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ నందు రూ.4,700, ప్రైవేట్ పాలిటెక్నిక్ నందు రూ.25,000 ఫీజులు నిర్ణయించామని వివరించారు. 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 17,004 సీట్లు, 175 ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 53,565, మొత్తం 70,569 సీట్లున్నాయని వివరించారు. విద్యార్థి ఎక్కడ చేరినప్పటికీ ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన ప్రతి విద్యార్థికి వర్తిస్తాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇంజినీరింగ్ వారికంటే పాలిటెక్నిక్ వారికే ఎక్కువ ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ సిలబస్‌లోనే స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ స్కిల్స్ రెండూ కలిపి ఉన్నాయని, విద్యార్థులు తమ కోర్సును పూర్తిచేసేసరికి ఉద్యోగానికి కావల్సిన నైపుణ్యం, స్వయం ఉపాధి అవకాశాలు సంపాదించుకోవచ్చని అన్నారు. బీటెక్ డిప్లొమా ద్వారా పూర్తిచేసిన విద్యార్థులకు ఆరేళ్ల సాంకేతిక అనుభవం ఉండటం వలన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లలో ప్రాధాన్యత ఇస్తారన్నారు. విద్యార్థులకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం బీహెచ్‌ఈఎల్, ఎల్‌అండ్‌టీ వంటి పెద్ద పెద్ద కంపెనీలతో సంప్రదింపులు చేపడుతున్నామని ఆయన వివరించారు.

రాబోయేది డ్రోన్ల శకం



- 2014కు ముందు సాంకేతిక పరిజ్ఞానం లేమితో పేదలకు తప్పని కష్టాలు
- డ్రోన్ మహోత్సవ్‌లో ప్రధాని మోదీ

న్యూదిల్లీ: రాబోయేది డ్రోన్ల శకమని, డ్రోన్ల ద్వారా సేవలు మరింత విస్తృతం అవుతాయని భారత్‌లోని అతిపెద్ద డ్రోన్ ఉత్సవ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. 2014కు ముందు పరిపా లనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం విషయంలో అశ్రద్ధ వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందిపడ్డారని వ్యాఖ్యానించారు. డ్రోన్లతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగిం చుకుంటూ ప్రజలకు సేవలను ప్రస్తుత ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సమయానికి దేశంలోని ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండాలని, ప్రతి పొలంలో డ్రోన్ ఉండాలని, ప్రతి ఇల్లు సుసంపన్నంగా ఉండాల న్నది తన స్వప్నమని మోదీ చెప్పారు. డ్రోన్ పరిజ్ఞా నానికి సంబంధించి భారత్‌లో అమితోత్సాహం.. ఈ రంగంలో ఉపాధి అవకాశాలకు సంకేతంగా తెలిపారు. సుపరిపాలన దిశగా కొత్త 'మంత్రా'ల అమలును ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించామని చెప్పారు. కనీస ప్రభుత్వం... గరిష్ఠ పాలన దిశగా సులభతర వాణిజ్యం, జీవన సౌలభ్యానికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సాంకేతిక పరిజ్ఞానాలను పేదలకు వ్యతిరేకమైనవిగా పరిగణించారని, పర్యవసానంగా 2014కు ముందు పేదలు, మధ్యతరగతి వర్గాలకు సరైన సేవలు అందలేదని మోదీ అన్నారు. సుపరిపాలన, జీవన సౌలభ్యతకు డ్రోన్ పరిజ్ఞానాన్ని ప్రోత్సహి స్తున్నామన్నారు. రేషన్ కోసం గంటల తరబడి క్యూలైన్లలో గడపాల్సిన పరిస్థితి ఇప్పుడు లేదని, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో రేషన్ పొందడం సులభమైందని ప్రధాని తెలిపారు. ఏదేని కొత్త టెక్నాలజీ తొలి లబ్ధిదారులు సామాన్యులే కావాలన్నారు.

ఆర్యన్ ఖాన్‌కు క్లీన్‌చిట్

న్యూదిల్లీ: ముంబై డ్రగ్స్ కేసులో బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్‌కు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) నుంచి క్లీన్‌చిట్ లభించింది. తగిన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఆర్యన్‌తో పాటు మరో ఐదుగురికి ఊరట లభించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ఆధారంగా 14 మందిపై ఎన్డీపీఎస్ చట్టంలోని వేర్వేరు సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. తగిన సాక్ష్యాధారాలు లేని కారణంగా మరో ఆరుగురిపై కేసు నమోదు కాలేదని ఎన్‌సీబీ ప్రకటన పేర్కొంది. 14 మంది పేర్లతో ఆరు వేల పేజీల చార్జిషీటును ఎన్‌సీబీ దాఖలు చేసింది. గతేడాది ముంబైలోని క్రూయిజ్‌లో ఎన్‌సీబీ దాడులు జరిపి ఆర్యన్ ఖాన్‌తో పాటు మరికొందరిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేసింది. ఆర్యన్ దగ్గర నుంచి డ్రగ్స్ లభించకపోవడాన్ని ఆయన తరపు న్యాయవాది కోర్టులో నొక్కిచెప్పారు. కుట్ర కోణం లేదన్నారు. ఆర్యన్ ఖాన్ (23) మాదక ద్రవ్యాలు తీసుకుంటారని, ఆయన వాట్సాప్ సంభాషణల ఆధారంగా తెలుస్తోందని ఎన్‌సీబీ అప్పట్లో బలంగా వాదించింది. ముస్లిం హీరోను లక్ష్యంగా చేశారన్న కోణంలో ఎన్‌సీబీ తీరుపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దర్యాప్తు అధికారి సమీర్ వాంఖడేపై ఎన్‌సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ) ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు సంచలనాత్మకమైంది. ఇద్దరు సాక్షుల్లో ఒకరైన ప్రభాకర్ సెయిల్‌తో ఖాళీ కాగితంపై బలవంతంగా సంతకం చేయించారన్న వాదన వినిపించింది. అరెస్టుకు కొన్ని గంటల ముందు ఆర్యన్ ఖాన్ దిగిన సెల్ఫీ ఒకటి వైరల్ కాగా అందులోని వ్యక్తి పూనేలో అరెస్టు అయ్యాడు. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ప్రభాకర్ సెయిల్ ఏప్రిల్‌లో గుండె పోటుతో మరణించారు. కాగా, అరెస్టు అనంతరం జైల్లో నాలుగు వారాలు గడిపిన అనంతరం 2021, అక్టోబరు 30న ఆర్యన్ ఖాన్ విడుదలయ్యారు. చివరికి సత్యమే గెలిచిందని ఆర్యన్ ఖాన్ కేసును వాదించిన న్యాయవాది ముకుల్ రోహత్గీ అన్నారు. ఆర్యన్ ఖాన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లభించలేదన్నారు. ఎన్‌సీబీ తమ తప్పును గ్రహించిందని చెప్పారు. ఆర్యన్ నిర్దోషిగా రుజువు కావడం తనకే కాదు షారుఖ్ ఖాన్‌కూ ఊరట కలిగించిందన్నారు.

వాంఖడేపై చర్యలకు కేంద్రం ఆదేశం

ఆర్యన్ ఖాన్‌కు ఎన్‌సీబీ క్లీన్‌చిట్ ఇచ్చిన క్రమంలో డ్రగ్స్ కేసు దర్యాప్తు అధికారి సమీర్ వాంఖడేపై చర్యలకు కేంద్రం ఆదేశాలిచ్చింది. ఆయన దర్యాప్తు పేలవంగా సాగిందని, అనేక అవకతవకలు జరిగాయని వెల్లడి అయిన క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది. క్రూయిజ్‌లో తనిఖీలు చేపట్టిన ప్రక్రియ వీడియో తీయకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఓ సాక్షితో ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉండటం కూడా వాంఖడేపై కేంద్రం చర్యలకు దారి తీసింది. అలాగే, కుల ధ్రువీకరణ వ్యవహారం లోనూ ఆయనపై చర్యలు చేపట్టనున్నట్ల కేంద్రహోంశాఖ అధికారి తెలిపారు. డబ్బుల కోసమే ఆర్యన్ ఖాన్‌ను ఈ కేసులో ఇరికించినట్లు ఎన్‌సీబీ ముంబై జోనల్ డైరెక్టర్ సమీర్ వాంఖడేపై ఎన్‌సీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. వాంఖడే ముస్లిం అని, ఉద్యోగం కోసం ఎస్సీగా తప్పుడు పత్రాలు సమర్పించినట్లు పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.